వార్త

ఆదివారం

15 డిసెంబరు, 2024



# విషపూరిత సాపాటు చదువులకే చేటు!





# ప్రత్యేక పాటలో నయనతార?

ప్రభాస్, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో 'ది రాజా సాబ్' సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై నిర్మితమవుతున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ ఈ చిత్రంలో ప్రభాస్ సరసన నటిస్తున్నారు. ఇందులో ప్రభాస్‌తో కలిసి నయనతార ఒక ప్రత్యేక పాటలో కనిపించనున్నట్లు తాజా సమాచారం. ఈ విషయమై ఆమెతో సంప్రదించినట్లు, ఆమె అంగీకరించినట్లు తెలుస్తోంది. వచ్చే సంవత్సరం ఏప్రిల్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. పదిహేడేళ్ల క్రితం వచ్చిన 'యోగి' సినిమాలో ప్రభాస్, నయనతార జంటగా నటించారు. ఆ తరువాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రాలేదు.

తారాతీరం

## ఆర్‌సి16లో దివ్యేంద్రు!

తొలి చిత్రం 'ఉప్పెన'తో బ్లాక్ బస్టర్ సాధించి అందరి దృష్టిని ఆకర్షించిన దర్శకుడు బుచ్చిబాబు సానా 'ఆర్‌సి 16' సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ పాన్ ఇండియా సినిమాలో భారీ తారాగణం నటిస్తున్నారు. కరుణడ చక్రవర్తి శివరాజ్‌కుమార్ ఈ సినిమా ద్వారా తెలుగు సినిమాల్లోకి ఎంట్రీ ఇస్తున్నారు. ఇందులో ఆయన చాలా పవర్‌ఫుల్ పాత్రలో నటించనున్నట్లు తెలుస్తుంది. బాలీవుడ్ యంగ్ సెన్సేషన్ దివ్యేంద్రు ఇందులో ఓ కీలక పాత్రలో అలరించబోతున్నారు. 'మీర్జాపూర్'లో మున్నాభాయ్ పాత్రలో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించిన దివ్యేంద్రు ఆర్ 16తో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తుండటం విశేషం. అలాగే టాలీవుడ్ వెర్సటల్ యాక్టర్ జగపతిబాబు ముఖ్య పాత్రలో మెప్పించనున్నారు.



ఆస్కార్ విన్నర్ ఎ.ఆర్.రెహమాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. బాలీవుడ్ బ్యూటీ క్వీన్ జాన్వీకపూర్ కథానాయికగా కనిపించనున్నారు. ఆర్.రత్నవేలు సినిమాటోగ్రఫీ అందించనున్న ఈ చిత్రానికి అవినాష్ కొల్ల ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఏగన్ ఏకాంబరం కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేస్తున్నారు.

## సందీప్‌కిషన్ హీరోగా ద్విభాషా చిత్రం?

తెలుగు కథానాయకుడు సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో తమిళ, తెలుగు భాషల్లో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. ఈ సినిమాకు దర్శకుడు తమిళ అగ్ర హీరో విజయ్ కొడుకు జాసన్ సంజయ్. హీరోల కుమారులు హీరోలుగా ఎంట్రీ ఇచ్చేందుకు ఆసక్తి చూపించడం సర్వసాధారణం. కానీ అందుకు భిన్నంగా విజయ్ తనయుడు జాసన్ సంజయ్ మెగా ఫోన్ పట్టుకున్నాడు. లైకా ప్రొడక్షన్స్ చిత్రంతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నాడు. సందీప్‌కిషన్‌ను హీరోగా ఎంపిక చేసుకోవడం ఇటు తెలుగులోనూ, అటు తమిళంలోనూ హైప్ క్రియేట్ అయింది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందిస్తున్నాడు. త్వరలో ఇతర ఇత తారాగణం గురించి ప్రకటన వెలువడుతుందని సమాచారం. ఈ సినిమా 2025 జనవరిలో సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.



ఆదివారం వార్త
15 డిసెంబరు, 2024

## మంచి ముత్యాలు

ఈరోజు పశ్చాత్తాపపడి పొరపాటును సరిదిద్దుకో. అది రేపటికి చాలా ఆలస్యం అవుతుంది.

\- జార్జి బెర్నార్డ్ షా

## విషయ విశేషం


అవయవదానం గొప్పగుణం....4

సంఘీ'భావం....5

ఆందోళన కలిగిస్తున్న సినీ దురభిమానం

కవర్ స్టోరీ

విషపూరిత సాపాటు
చదువులకే చేటు!

ఈవారం కవిత్వం...12

బతుకు పుస్తకం

ఉద్యాన నగరి బెంగళూరు....14

చెరువు మధ్యలో దీవి.....18

కథ..20

నిజతగా నేనుంటా..

సాహిత్యం...23

ప్రాచీనాంధ్ర సాహితీ ప్రస్థానం

స్వయంకృతాపరాధం......24

ఉత్తర ద్వార దర్శనం....26

ఖరీదైన ఉన్ని....28

ఇంకా...

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..



# తాజా వార్తలు

## ఎస్కలేటర్‌లో లాంగ్ జర్నీ



సాధారణంగా ఎస్కలేటర్లు షాపింగ్ మాళ్లలోనూ, రైల్వే స్టేషన్లలోనూ కనిపిస్తుంటాయి. మనల్ని మరో అంతస్తుకు నిటారుగా ఎక్కించే ఆ ఎస్కలేటర్లు పిల్లలకు భలే సరదాగా కూడా ఉంటాయి. కానీ ఇవి ఆరుబయట ప్రదేశాల్లో ఎక్కడా మనకు కనిపించవు. చైనాలోని హుబే ప్రావిన్స్ గ్రాండ్ కాన్యన్ పర్వతాన్ని చేరడానికి ఏకంగా ఎస్కలేటరును నిర్మించింది ఆ దేశ పర్యటకశాఖ. ఒకేసారి ఏడున్నరవేల మందిని తీసుకెళ్లే సామర్థ్యమున్న ఆ ఎస్కలేటర్ దాదాపు అరకిలో మీటరుపైనే పొడవు ఉంటుంది. దాని పైన అరగంట ప్రయాణం చేసి అక్కడికి చేరుకుంటారు ప్రయాణికులు. మలుపులు తిరుగుతూ, ఎత్తుపల్లాలు దాటుకుంటూ ముందుకెళ్లే ఈ ఎస్కలేటరైన వెళ్తే ప్రకృతిని ఆస్వాదిస్తూ సుందర దృశ్యాల్ని వీక్షి స్తూ ప్రత్యేక అనుభూతికి లోనవడం ఖాయమట. అందుకే ప్రపంచంలోనే పొడవైన ఆ అవుట్డోర్ ఎస్కలేటర్లపైన ప్రయాణించడానికి పర్యటకులు బారులు తీరుతున్నారు.






మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

# అవయవదానం గొప్ప గుణం




మనిషికి ప్రాణంపై ఉన్న మక్కువ వెల కట్టలేనిది. మరణం అనేదే లేకుండా చేసేందుకు ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నో ప్రయోగాలు చేశారు. దేవుడు రాసిన తలరాతను ఎవరూ మార్చలేరు. దాన్ని మార్చడం ఎవరి వల్ల కాదు. అయితే అమరులుగా ఉండాలనే ఆశ మనిషి లో ఎప్పటికీ తగ్గదు. ఇదంతా ఎందుకు చెప్పుకోవడం అంటే.. అందరూ స్వార్థంగా ఉండరు. సమాజంలో ఎంతో నిస్వార్థంగా జీవించే వారూ ఉంటారు. వారి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. చిన్న సహాయం చేస్తే గొప్ప పని చేశాం అని చెప్పుకునే ఈ రోజుల్లో... అవయవదానం చేసే గొప్పవాళ్ళు కూడా ఉన్నారు. మరికొందరు ఇంకో అడుగు ముందుకేసి మొత్తం శరీరాన్ని దానం చేసే వారిని ఏమనాలో... ఇలా నగరంలో ఎంతోమంది మరణానంతరం తమ భౌతికదేహాలను పరిశోధనల కోసం దానం చేసేందుకు ముందుకు వచ్చారు.

**అవయవదానం గొప్పదానం**

దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది అంటారు.. కానీ అన్నింటి కన్నా దేహాన్ని దానం చేయడం గొప్ప విషయం అని చెప్పుకోవచ్చు. ఎందుకంటే దానం చేయడం అంత సులువైన విషయం కాదు. సామాజిక, సంప్రదాయ, ఆర్థిక, మానసిక సమస్యలు ఇందులో ముడిపడి ఉంటాయి. కుటుంబంతో పాటు.. బంధువుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుంది. ముందుగా దేహాన్ని దానం చేయాలంటే పెద్ద మానసిక సంఘర్షణ ఎదుర్కోవాల్సి వస్తుంది. అవన్నీ దాటుకుని ముందడుగు వేయడం చాలా పెద్ద విషయం, కుటుంబ సభ్యులను ఒప్పించడం కూడా పెద్ద టాస్క్ అని చెప్పవచ్చు.

**ఎన్జీవోల పాత్ర మరువలేనిది**

సాధారణంగా అవయవదానం, మృతదేహాలను దానం చేసే విషయంలో ఎన్జీవోలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. నగరంలోని పలు సంస్థలు ఈ దిశగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాయి. ఎంతోమంది తమ అవయావాలు దానం చేసేందుకు కృషి చేస్తున్నాయి. దీంతో పాటు కడవర్ దానం చేయించడం అంత సులువైన పని కాదని పలువురు ఎన్జీవోల నిర్వాహకులు చెబుతున్నారు. చాలావరకూ కనీసం పోస్టుమార్టం చేయించేందుకే విముఖత చూపిస్తారని.. అలాంటి సమాజంలో ఉన్న వారిని ఒప్పించడం ఇబ్బందికరమేనని పేర్కొంటున్నారు.



**చదువుకున్న వాళ్లలో..**

దానం చేసిన దేహాన్ని కడవర్ అంటారు. దేహం దానం చేయడం ఎక్కువగా చదువుకున్న వారిలో కనిపిస్తుంది. సమాజంపై అవగాహన ఉండటం వల్ల కూడా చాలామంది ముందుకు వస్తున్నారు..

**పరిశోధనల కోసం....!**

మామూలుగా బ్రెయిన్ డెడ్ అయిన వారి శరీరాల నుంచి అవయవదానం చేస్తుంటారు. కానీ చనిపోయిన తర్వాత శరీరం అవయవ దానాలకు పనికి రాదు. అప్పుడు శరీరాన్ని మెడికల్ కాలేజీలకు దానం చేస్తారు. ఆ శరీరాన్ని ప్రయోగాలు చేసుకునేందుకు, పరిశోధనలు చేసేందుకు వినియోగిస్తారు. శరీరాన్ని దానం చేయాలంటే... మరణానికి ముందు స్థానిక వైద్యకళాశాల, ఆస్పత్రి లేదా ఎన్జీవోతో ముందస్తు ఒప్పందం చేసుకోవాలి. సంబంధిత పత్రాలపై సంతకం చేయాల్సి ఉంటుంది. మరణించిన తర్వాత వారికి సమాచారం అందిస్తే అన్ని పార్మాలిటీలు పూర్తి చేస్తారు. అయితే చనిపోయిన తర్వాత కూడా కుటుంబ సభ్యులు అందరూ ఒప్పుకుని సంతకాలు చేసి దానం చేయొచ్చు.

**అమ్మ కోరిక మేరకు...**

హైదరాబాద్‌లో నివసిస్తున్న ఓ కుటుంబం తమ తల్లి మరణానంతరం ప్రయోగాల కోసం ఇచ్చారు. ఆమె మరణానంతరం అన శరీరాన్ని ప్రయోగాల కోసం దానం ఇవ్వాలని అమ్మ కోరిక. కుటుంబ సభ్యులమంతా కలిసి ఈ విషయంపై నిర్ణయం తీసుకున్నాం. ఆమె మరణించిన తర్వాత ఓ ఎన్జీవోకు ఫోన్ చేసి, విషయం చెప్పాం. అయితే మా నిర్ణయాన్ని చాలా మంది వ్యతిరేకించారు. కర్మకాండలు జరిపించకపోతే పాపం అని చాలామంది అన్నారు. కానీ ప్రయోగాల కోసం దేహాన్ని ఇస్తే ఎంతోమందికి జ్ఞానం వస్తుందని మేం నమ్మాం. ఎంతమంది ఏం అనుకున్నా ముందుకు వెళ్లాం. ఒకానొక సందర్భంలో మిమ్మల్ని వేలేసినంత పని చేశారు. అయినా కూడా సంప్రదాయాలను పక్కన పెట్టి శరీర దానానికి ముందుకు వచ్చారు. ఆమెకు ఆమెనే గొప్ప బిరుదు సంపాదించుకున్నారు. ■

'సంఘీ' భావం



# ఆందోళన కలిగిస్తున్న సినీ దురభిమానం

వినోదాన్ని అందించాల్సిన సినిమాలు విషాదాన్ని నింపుతున్నాయి. సినీ ప్రపంచంలో వస్తున్న మార్పులు ప్రజల్లో ముఖ్యంగా యువతలోని ఆలోచనాధోరణిని ఆందోళనకరంగా మారుస్తున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియా, సెల్‌ఫోన్‌ల ప్రభావం వల్ల సినీమైకంలో చిన్నారులు కూడా బలి అవుతున్నారు. కొన్ని సందర్భాల్లో చిన్నారులు విచక్షణాజ్ఞానాన్ని కోల్పోతున్నారు. దానిని అదుపుచేయాల్సిన తల్లిదండ్రులు అందుకు భిన్నంగా వ్యవహరించి వారు మరింత పక్కదారి పట్టే విధంగా ప్రోత్సహిస్తున్నారు. పుష్ప 2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్ లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మహిళ చనిపోగా తొమ్మిదేళ్ల ఆమె కుమారుడు మృత్యువుతో పోరాడుతున్నాడు. ఒకప్పుడు సినిమాలకు వెళ్లడానికి పిల్లలు తల్లిదండ్రుల అనుమతి కోరడానికి సైతం భయపడేవారు. కనీసం ఇంటర్మీడియట్ తరువాత సుమారు 18 ఏళ్ల వయస్సులో సినిమాలపై దృష్టి సారించేవారు. కొన్ని సినిమాల్లో శృంగారం, భయానక దృశ్యాలు, హింసను ప్రోత్సహించే అంశాలు ఉంటే తల్లిదండ్రులు అలాంటి సినిమాలు చూసేందుకు నిరాకరించే వారు.

అప్పట్లో సినిమాలు ఎంతోకొంత సందేశాన్ని కూడా ఇచ్చేవి. సకుటుంబ సపరివారంగా చూడాల్సిన సినిమాలు ఉండేవి. దీనితో నెలకో, రెండు నెలలకో పిల్లలను తీసుకుని తల్లిదండ్రులు సినిమాకు వెళ్లే వారు. సినిమా విడుదల అయి మొదటి నెల రోజుల వరకు కుటుంబాలు ఆయా సినిమాలకు వెళ్లేవి కావు. అయితే యువత మాత్రం విడుదల అయిన ఒకటి రెండు రోజుల్లో సినిమాను చూసి మిత్రులతో గర్వంగా చెప్పేవారు. ఇక వీరిలో కొందరు సినీ హీరోలకు అభిమానులుగా మారి ఏకంగా సంఘాలను ఏర్పాటుచేసుకునే వారు. తమ హీరో సినిమా విడుదల అయితే వీరికి పండుగ వాతావరణం ఉండేది. మొదటి వారం రోజులు వీరి హడావిడి అధికంగా ఉండేది. అభిమాన సంఘాల సభ్యులు సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొనేవారు. సినీ హీరోలు కూడా ఈ సంఘాలకు కొంత ఆర్థిక సహాయం చేసి ప్రోత్సహించేవారు. ఇది క్రమంగా వేలంవెర్రిగా మారి ఎదుటి హీరో సినిమా విడుదల సమయంలో వ్యతిరేక ప్రచారంలో నిమగ్నమయ్యే వారు. తమ వ్యతిరేకతను పోస్టర్లపై పేడ ముద్దలు వేయడం ద్వారా ప్రదర్శించే వారు. ఆ తరువాత క్రమంగా ఒకరిపై మరొకరు దాడులు చేసుకునే వారు. కొన్ని సందర్భాల్లో హత్యలు కూడా చోటుచేసుకున్నాయి. అయితే క్రమంగా ఈ అభిమానం వెర్రితలలు వేస్తోంది. సాధారణంగా సినీ హీరోలను కొందరు తమను అన్వయించుకుని సంతృప్తి చెందుతుంటారు. ఉదాహరణకు రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో వచ్చిన శివ సినిమా యువతపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. కళాశాలల్లో భవానీ, శివ గ్యాంగులు తయారయ్యాయి. సినిమాలను కేవలం వినోదం కోసం చూడాలన్న అంశం క్రమంగా మరుగున పడిపోతోంది. నిత్యం దైనందిన జీవితాలు, ఉద్యోగంలో వత్తిడిని ఎదుర్కొవడానికి ఇలాంటి వినోద కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ఉపశమనం పొందవచ్చని మానసిక తత్వవేత్తలు స్పష్టం చేస్తున్నారు. అయితే ఏదీ కూడా మితిమీరి ఉండకూడదు. అది ఎప్పటికీ ప్రమాదమే. హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన విషాకరమే. ఇందులో పోలీసుల వైఫల్యాలు, సినిమా థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం, అత్యంత రద్దీ ప్రాంతంలోకి సినీ హీరో, హీరోయిన్‌లు రావడం వంటి అనేక తప్పిదాలు కారణంగా ఉండవచ్చు. అయితే ఇక్కడ మరో కోణం నుంచి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉంది. 9 ఏళ్ల కుమారుడు ఒక సినీ హీరోను విపరీతంగా అనుకరించడం, తనకు తాను పుష్పగా అభివర్ణించుకుని తన వ్యవహారశైలిని మార్చుకోవడం ఎంత ప్రమాదకరమో తల్లిదండ్రులు గుర్తించలేకపోయారు. కట్టడి చేయాల్సిన వారే మరింతగా ప్రోత్సహించారు. మొదటి రోజు మొదటి ఆట చూడాలనే తపన చిన్నారిలో ఉండవచ్చు కాని దీనిని సున్నితంగా తిరస్కరించి వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుంది. పైగా ఇది మొదటి ఆట కూడా కాదు. అంతకంటే ముందుగా కేవలం అభిమానులు కోసం, ఇంకా చెప్పాలంటే ఎక్కువ మొత్తంలో డబ్బు రాబట్టుకునేందుకు నిర్మాతలు చేసే వ్యాపార ప్రయత్నం. ఈ షోలో సినిమా చూసే వారికంటే కేకలు, విజిల్స్ వేసి కుర్చీలు ఎక్కి డాన్స్ చేసే వారే అధికంగా ఉంటారు. ఇలాంటి షోకు ఒక కుటుంబ అది కూడా ఏడేళ్ల పాప, 9 ఏళ్ల కుమారుడిని తీసుకువెళ్లడం ఏమాత్రం హర్షణీయం కాదనిపిస్తుంది. చిన్నారికి ఈ అంశాలపై ఏమాత్రం అవగాహన ఉండదు. కానీ తల్లిదండ్రులకు కుమారుడిని నచ్చజెప్పాల్సిన బాధ్యత ఉంది. సినిమాల ప్రభావం చిన్నారులపై సైతం ఏ విధంగా చూపిస్తుందో అన్న దానికి ఇది ఒక ఉదాహరణగా నిలుస్తోంది. పైగా పుష్ప క్యారెక్టర్ సమాజానికి చెడు చేసే విధంగా ఉంటుంది. ఒక స్మగ్లర్ వ్యక్తిత్వం కలిగి, సమాజానికి, చట్టాలకు అతీతంగా వ్యవహరించేదిగా చిత్రీకరించారు. వినోదం కోసం చూసే సమయంలో ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు. అయితే ఆ క్యారెక్టర్‌ను ఇలాంటి చిన్నారులు, యువత అనుకరిస్తే సమాజానికి కలిగే నష్టాన్ని అంచనా వేయవచ్చు. ఒకప్పుడు సినిమాలు సమాజహితంగా ఉండేవి. ప్రస్తుతం మారిన పరిస్థితులు, పాశ్చాత్యపోకడలు సినీరంగాన్ని కూడా విషతుల్యం చేశాయి. పెట్టిన పెట్టుబడిని నాలుగు రెట్లు సంపాదించుకోవడానికి నిర్మాతలు, దీపం ఉండగానే ఇళ్లు చక్కబెట్టుకోవాలన్న రీతిలో హీరోలు వ్యవహరిస్తున్నారు. సమాజంలో మనం స్థానం ఏమిటన్న విషయం తెలిసి మెలిగినప్పుడే ఇలాంటి విషాదకర ఘటనలు జరిగే అవకాశం ఉండదు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# విషపూరిత సాపాటు చదువులకే చేటు!

కవర్ స్టోరీ

వడ్డేపల్లి మల్లేశము

**ఆహారం** మన జీవనాధారం. ఆహారం, పానీయం ఈరెండు మనం జీవించేందుకు దోహదపడతాయి. నాలుగురోజులు భోజనం మానేస్తే శరీరం నీరసించిపోతుంది. ఆరోగ్యం కోసం, బతికేందుకు మనం తప్పనిసరిగా ఆహారాన్ని తీసుకోవాల్సిందే. అయితే తినే ఆహారం కలుషితమైనదిగా ఉంటే మన ఆరోగ్యం దెబ్బతింటుంది. కాబట్టి భోజనం ఎంత అవసరమో పరిశుభ్రమైన పదార్థాలను తినడం కూడా అంతే అవసరం. పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం తప్పనిసరి. ఆధునిక మానవుడు అన్నింట్లోనూ పరుగులు తీస్తున్నాడు. ఈ జీవనపోరాటంలో చదువు, ఉద్యోగం కోసం నిరంతరం పోరాడుతూనే ఉన్నాడు. ఇందులో భాగంగా చదువుకోసం హాస్టళ్లను ఆశ్రయించడం, ఉద్యోగం కూడా వర్కింగ్ మెన్, ఉమెన్స్ హాస్టల్స్‌లలో ఉండడం అనేకులకు తప్పనిసరి అయింది. ఇందులో భాగంగా హాస్టల్స్ ఫుడ్ తినాల్సిందే. అయితే హాస్టల్స్‌లలో, ఆయాప్రదేశాలలో వండేవిధానం, అక్కడ పాటించే పరిశుభ్రత గురించి అందరికీ తెలిసిందే. దీంతో తరచూ ఫుడ్‌పాయిజింగ్ సమస్య ఉత్పన్నమవుతున్నది.

ఆహార విషతుల్య సమస్య భారతదేశంలో ఈనాటిది కాదు. దేశంలో ఏదో ఒక మూలన ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అయితే ఇటీవలకాలంలో తెలుగురాష్ట్రాలలో ఈ సమస్య తరచూ ఉత్పన్నమవుతుండడం విచారకరం. ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు విద్యార్థులు ధర్నా, నిరసనలు చేయడం సంబంధిత కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఇలా జరగకుండా చర్యలు తీసుకుంటామనే హామీలతో సమస్యలు సమస్యలుగానే మిగిలిపోతున్నాయి. అంతేతప్ప ముఖ్యంగా పేద వర్గాల పిల్లలు ఉండే ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాలలో ఇలాంటి అమానవీయ సంఘటనలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి అంటే పేద వర్గాల పిల్లల పట్ల పెట్టుబడిదారు సంపన్న వర్గాలకు మాత్రమే కాదు ప్రభుత్వాలకు కూడా ఇంత చిన్న చూపా? తెలంగాణ రాష్ట్రంలోని నారాయణపేట జిల్లా మాగనూరు ఉన్నత పాఠశాలలో గతనెల నవంబరులో మూడుసార్లు మధ్యాహ్న భోజనం విషపూరితం కావడంతో విద్యార్థులు అనారోగ్యం పాలై, ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్నారు. చావు అంచుల వరకు వెళ్లి, బతికి వచ్చారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి మార్పులు లేవు. నవంబరు 21వ తేదీన యాభైమంది, 21వ తేదీన 70 మంది 25వ తేదీన 27 మంది విద్యార్థులు వాంతులు విరోచనాలతో ప్రమాదకర పరిస్థితిలో చెరుకోవడంతో ఆసుపత్రుల్లో చేర్పించినప్పటికీ ఆ పాఠశాల మధ్యాహ్న భోజన విషయంలో ఎలాంటి మార్పు లేకపోవడం అధికారులు తగిన చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగించే విషయం. ఒక ఉపాధ్యాయుడిని, డిఈఓను, కొంతమంది అధికారులను సస్పెండ్ చేసినట్టుగా మనం వార్తల్లో వింటున్నాం, అందులో వాస్తవం ఎంతో తెలియదు. వరుసగా మూడుసార్లు ఒకే పాఠశాలలో సుమారు 127 మంది విద్యార్థులు ప్రమాదకర పరిస్థితులకు చేరుకోవడంతో వివిధ అస్పత్రిలో చికిత్స అందించినట్లు తెలుస్తున్నది. అయినా ఆ పాఠశాల మధ్యాహ్న భోజన స్థితిగతుల పైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపైన స్పందించినటువంటి రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం నవంబరు 24, 2024 వారం రోజుని ప్రభుత్వానికి పెట్టిన చివాట్లు అంతాఇంతా కాదు. సమాచారం తెప్పించుకోవాలంటే వారం రోజుల సమయం కావాలని, దాటవేసి ధోరిణి ప్రదర్శించడాన్ని కటువుగా తీసుకున్న హైకోర్టు సుమార ప్రాంతంలో ఉన్నారా? అని, సౌకర్యాలు లేని మారుమూల ప్రాంతమా? ఎందుకు అశ్రద్ధ చేస్తున్నారు? మీ పిల్లలు కూడా అలాగే అయితే చూస్తూ ఊరుకుంటారా? పేద పిల్లల ప్రాణ చెలగాటమాడితే సహించే ప్రసక్తి లేదని, అలాగే ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాని హైకోర్టు హెచ్చరించింది.

ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు ఏజెన్సీ తోపాటు జిల్లాస్థాయి అధికారుల వరకు ఎంత నిర్లిప్తంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఈ విషయంపైన హైకోర్టు స్పందించిన తర్వాత అనివార్య పరిస్థితుల్లో రాష్ట్రఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పందిస్తూ త్వరలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని, ఎమ్మెల్యేలు, మంత్రులు అధికారులు తరచుగా సందర్శించాలని,



కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటిస్తే పేద పిల్లల ఆర్తనాదాలు ఆగుతాయా? అంతెందుకు అప్పటి నుండి అలాంటి సంఘటనలు ఆగకపోగ ఏదోఒక మూల పాఠశాలలు, హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండారాల దుకాణాలలో దుస్సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. లాభాపేక్షతో కూడిన బరితెగించిన తనం కాక మరేమిటి?

## విషతుల్య ఆహారంతో బాలిక మృతి

ఇదే పద్ధతిలో కొమరం భీమ్ జిల్లా వాంకిడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో కూడా 2024 అక్టోబరు 30వ తేదీరాత్రి ఆలుగడ్డ కూర పప్పుతో భోజనం చేసిన 30మంది బాలికలు వాంతులు విరేచనాలతో అనారోగ్యం బారిన పడ్డట్టు తెలుస్తుంటే రెండురోజుల్లో ఈ సంఖ్య భారీగా పెరగడంతో ఆసుపత్రిలో చేర్పించినప్పటికీ ఆ బాధలు తగ్గకపోగా శైలజ అనే అమ్మాయి మరణించింది. ఈ సంఘటన అత్యంత బాధాకరం. ఈ వార్త విన్నవారు ఎవరైనా బాధపడకుండా ఉండరు. కర్తవ్యనిర్వహణ సమయంలో పోషకాహారంతోపాటు ఆరోగ్యకరమైన పద్ధతిలో ఆహారాన్ని అందించి పేదింటి పిల్లలను సరిగా చూసుకోవలసిన విషయాన్ని విస్మరించి, అనారోగ్యం బారినపడ్డప్పుడు మాత్రం ఎంత ఖర్చు అయినా ప్రభుత్వం భరిస్తుందని, మెరుగైన వైద్యసేవల కోసం వెనుకాడే ప్రసక్తి లేదని అధికారులను పురమాయించి మంత్రులను పంపించి హల్‌చల్ చేస్తున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుంటే ప్రయోజనం ఏముంటుంది? ఆలోచన ముందుగానే కొరవడినటువంటి ప్రభుత్వాల పనితీరును గత ప్రభుత్వాల హయాంలో కూడా మనం గమనిస్తే వందలాదిమంది విద్యార్థులు ఇలాగే అనారోగ్యం బారినపడి మరణించిన ఉదంతాలు జరిగాయి. తెలంగాణలో ప్రతిపక్షం వారు ఆహారవిషతుల్యం వల్ల ఇప్పటివరకూ 38మంది విద్యార్థులు మృత్యువాత పడినట్లు చెబుతున్నారు.



## విచారణతో సమస్య తొలగేనా?

విద్యాసంస్థల్లోని హాస్టళ్లలో తరచూ జరుగుతున్న ఫుడ్‌పాయిజన్ సమస్యపై ప్రభుత్వం కూడా తీవ్రంగా పరిగణించి, విచారణకు ఆదేశాలు జారీ చేసింది. బిఆర్ఎస్ పార్టీ నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసి రాష్ట్రమంతా పర్యటింపచేసి తగిన సూచనలు చేస్తుందని ప్రకటించింది. అయితే ఇలాంటి సంఘటనలు ఎందుకు జరుగుతున్నాయో తెలుసుకుని, శాశ్విత పరిష్కారం దిశగా ప్రయత్నాలు చేయాలి. తెలంగాణ హైకోర్టు స్పందించిన తీరును అందరం స్వాగతించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతూ ఉంటే ప్రజా ఉద్యమాలు, అంతెందుకు విద్యార్థి సంఘాలు కూడా పెద్ద మొత్తంలో పాఠశాలలు కళాశాలలు విద్యాసంస్థలను బహిష్కరించడంతో పాటు ప్రభుత్వాన్ని కదిలింప చేసే ఉద్యమాలు కూడా రావాల్సిన అవసరం చాలా ఉన్నది. ఏదో ఒక సందర్భంలో జరిగిపోయింది పొరపాటు అనుకుందామంటే అలాంటి పరిస్థితి లేనే లేదు. ప్రభుత్వం ఒకవైపు పోషకాహారంతో పాటు ఏజెన్సీలకు విద్యార్థుల ఖర్చులకుగాను ధరలను పెంచినట్లు ప్రకటించినప్పటికీ ఆచరణలో ఇలాంటివి జరుగుతున్నాయంటే నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనపడుతున్నది. అందరి ఇండ్లలో జరగనటువంటి ఈ ఫుడ్ పాయిజన్ కేవలం వసతి గృహాలలో, హోటళ్లలో, పాఠశాలల్లో మాత్రమే జరుగుతున్నాయి. ఈ పరిస్థితులను మార్చలేం అని ప్రభుత్వం అనుకోకుండా ఈ సమస్యను పరిష్కరించేందుకు తీవ్రంగా కృషి చేయాలి. లేకుంటే ఆ బాధ్యతను, అధికారాన్ని కోర్టులు కైవసం చేసుకుంటాయని ప్రకటించినవి అంటే మనందరికీ సిగ్గుచేటే కదా!

ఇటీవలి కాలంలో రెస్టారెంట్లు, హోటళ్లు, తినుబండారాలు, బిర్యానీ కేంద్రాలలో నిలువ వున్న చికెన్, మటన్‌తో పాటు గడువు దాటిన ఆహార పదార్థాలు, కుళ్లిన, రంగు మారిన సరుకులు భోజనంలో విరివిగా వినియోగిస్తూ లాభాపేక్షతో దుర్వాసన రాకుండ తగిన ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ ఈ అఘాయిత్యంపైన ఆహార తనిఖీ అధికారులు లంచాలకు మరిగి మౌనంగా వుంటున్నట్లు తెలుస్తున్నది. కమ్మటి రుచితో నోరూరించే దుర్మార్గ ప్రవృత్తికి నిర్వాహకులు ఆకర్షిస్తుంటే అమాయకంగా, అతివిశ్వాసంగా తిని తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న వారెందరో బలవుతున్న సందర్భాలు మరిచిపోయిన ఫుడ్ పాయిజన్‌ను మళ్లీ తెరమీదికి తెస్తూ కడుపుకోత నింపుతున్నాయి.



## ఫుడ్‌పాయిజన్ దుష్పరిణామాలకు అంతం లేదా?



ఆహార పదార్థాలతో లాభాపేక్షతో వ్యాపారం చేసే సంస్థల నిర్వాహకులపై ఆహార తనిఖీ అధికారుల దాడులు ముమ్మరం చేయాలి. ప్రభుత్వం ఇటీవల టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ నిరంతరం ప్రజల చైతన్యం కూడా ముఖ్యమే. నోటి రుచి కాకుండా ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల కోసం అరికట్టడానికి వినియోగదారులు డిమాండ్ చేయాలి. అంతేకాదు, కలుషిత ఆహారాలను నిరసించి, ప్రమాదాలను ఊహించి, బహిష్కరించి, తమ సత్తా చూపే తెగువ కూడా చాలా అవసరం. అంతే స్థాయిలో ప్రజలు ఫుడ్ ఇన్స్‌పెక్టర్లను నిలదీసి జరుగుతున్న మోసాన్ని, అనారోగ్య పరిణామాలపై నిలదీయడం కూడా ఆహారం విషపూరితం కాకుండా అడ్డుకోవడానికి ఎంతో తోడ్పడుతుంది. స్థానికంగా ఉన్నటువంటి ప్రజాస్వామికవాదులు ఆరోగ్య ఆహార రంగ నిపుణులు ఉపాధ్యాయులు రిటైర్డ్ విద్యావేత్తలతో మండలాల వారిగా కమిటీలను ఏర్పాటు చేసి వాటికి అధికారాలను కట్టబెట్టి స్వచ్ఛందంగా పని చేసే విధంగా పురమాయించడం కూడా ప్రభుత్వాలు ఆలోచించాలి.

పాఠశాల ఉపాధ్యాయ సిబ్బందికి పూర్తి బాధ్యతను వంట కోసం కేటాయించవలసి రావడం పాఠశాల బాధ్యత మరింత బరువు కావడంతో కూడా ఇలాంటి సంఘటనలు జరిగే ప్రమాదం లేకపోలేదు. అందుకోసమే ఉపాధ్యాయులను పాక్షికంగా బాధ్యులను చేస్తూనే ఇతరత్రా స్వచ్ఛంద కమిటీల పర్యవేక్షణలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించడం, వసతి గృహాలలో భోజన కార్యక్రమాన్ని నిక్కచ్చిగా అమలు చేయడానికి శ్రీకారం



చుట్టవలసిన అవసరం ఎంతగానో ఉంది. విద్యార్థి సంఘాలు, రాజకీయ పక్షాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేసిన మేరకు భోజన సౌకర్యానికి పెంచిన ధరలను వెంటనే ప్రభుత్వాలు అమలు చేయడంతో పాటు నిర్వాహకులకు అధిక వేతనాలను ఎలాంటి జాప్యం లేకుండా ఎప్పటికప్పుడు పంపిణీ చేయడం కోతలు విధించకుండా స్వచ్ఛందంగా సంతృప్తిగా పని చేసే విధంగా సిబ్బందిని కూడా ప్రోత్సహించినప్పుడు మాత్రమే ఇలాంటివి జరగకుండా ఉండే అవకాశం కొంతవరకైనా ఉంటుంది. నిర్వాహకులలో సంతృప్తి, తగిన పర్యవేక్షణ, స్వచ్ఛంద కమిటీల తోడ్పాటు సమాంతరంగా కొనసాగించినప్పుడు మాత్రమే ఇలాంటి ఫుడ్ పాయిజనింగ్ సమస్యలను కొంతవరకైనా తగ్గించడానికి అవకాశం ఉంటుంది. ఇక వంట చేసే పని పరిస్థితులను మెరుగు పరచడం, వంటశాలలను ఆధునిక వసతులతో ఏర్పాటు చేయడం, అపరిశుభ్రమైనటువంటి వాతావరణాన్ని లేకుండా చూడడం, పరిశుభ్రతను పెద్ద మొత్తంలో పాటించడం, నీటి సరఫరా విషయంలో రాజీ పడకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిబంధనలను అమలు చేయడం ద్వారా కూడా వాంతులు విరేచనాలు ఇతర అనారోగ్య సమస్యల బారినపడకుండా చూసుకోవచ్చు. ఇది ఏ ఒక్కరి వల్లనో సాధ్యమయ్యే పని కాదు, అలాని కేవలం నిర్వాహకులు, ఉపాధ్యాయులను మాత్రమే బాధ్యులను చేసి ప్రభుత్వం తప్పించుకుంటుంది అంటే ఒప్పుకోవడానికి ఎవరు సిద్ధంగా లేరు. అందుకే ఇలాంటి ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు ఇకనైనా ఇకపై సాగదు.. అని పెద్ద ఎత్తున పోరాడటం ద్వారా దీనితో సంబంధం ఉన్న అన్ని వర్గాలకు కూడా కనువిప్పు కలగాల్సిన అవసరం ఎంతగానో ఉన్నది. న్యాయవ్యవస్థ కూడా ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు పై అన్ని పరిస్థితులలోనూ ఆహారం విషపూరితం అయ్యి అనారోగ్య బారినపడ్డ ప్రతి సంఘటనకు భారీగా జరిమానా, శిక్షలు విధించడం ద్వారా కనువిప్పు కల్గించాలి. బాధ్యతను గుర్తింపచేసి నివారించగలగాలి.

మనం తినే ఆహారం ఎందుకు కలుషితం అవుతుంది? మనం తినే ఆహారం కలుషితం అయితే కనిపించే లక్షణాలు ఏమిటి? ఎందుకు కొంతమందిలో తరచూ ఫుడ్ పాయిజన్ అవుతుంది ? అనేది ఇప్పుడు మనం తెలుసుకుందాం. మనం తినే ఆహారం సరిగ్గా వండకపోయినా, వండిన ఆహారాన్ని ఎక్కువ కాలం ఫ్రిజ్‌లో నిల్వ ఉంచినా, ప్యాక్ చేసిన ఆహారాన్ని సరైన



టెంపరేచర్‌లో నిల్వ చేయకున్నా ఫుడ్ పాయిజన్ అవుతుంది. వేడి ఆహారాన్ని వెంటనే చల్లార్చటం, చల్లని ఆహారాన్ని ఒకేసారి వేడి చేయటం చేసినా ఫుడ్ పాయిజన్ అవుతుంది. ఇంకా ఫుడ్ పాయిజన్‌కు అపరిశుభ్ర వాతావరణం, చేతులలో ఉండే అపరిశుభ్రమైన బ్యాక్టీరియా కూడా కారణం కావచ్చు. ఇక ఫుడ్ పాయిజన్ అయితే లక్షణాలను ఎలా గుర్తించాలి అంటే.. ఫుడ్ పాయిజన్ అయిన వారికి ప్రారంభ సంకేతాలుగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి.



**కనిపించే లక్షణాలు**

వికారంగా ఉండటం, వాంతులు కావటం, విరేచనాలు కావటం, కాళ్ళు చేతులు లాగటం, విపరీతమైన కడుపునొప్పి, అప్పుడప్పుడూ కడుపు మెలిపెడుతునట్టు నొప్పి కలుగుతాయి. అంతేకాదు ఫుడ్ పాయిజనింగ్ వలన తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన దాహంగా ఉండటం, తరచూ విరేచనాల వలన డీ హైడ్రేషన్, మూత్ర విసర్జన తగ్గటం , జ్వరం రావటం, చలిగా అనిపించటం, కండరాల నొప్పి, శక్తి లేకపోవటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కళ్ళు తిరగటం, చూపు మందగించటం, నరాల బలహీనత, ఆకలి లేకపోవటం వంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి. అసలు ఫుడ్ పాయిజనింగ్ ఎవరికి అవుతుంది.. అంటే బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ కలిగిన వారికి ఫుడ్ పాయిజనింగ్ అవుతుంది. వారు వ్యాధి నిరోధక శక్తి లేకపోవటం వలన ఏ చిన్న బ్యాక్టీరియా దాడి చేసినా అస్వస్థతకు గురవుతారు.



మనకి పడని ఆహారం లేదా నిల్వ ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల కొంతమందికి ఫుడ్ పాయిజనింగ్ అవుతుంది. ఏదో ఒక సందర్భంలో అందరూ దీని బారిన పడి ఇబ్బంది పడుతూనే ఉంటారు. కడుపులో అసౌకర్యంగా ఉండటం, వాంతులు, విరోచనాలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది సాధారణ ఆరోగ్య సమస్య అయినప్పటికీ కొన్నిసార్లు ప్రమాదకరం కూడా కావచ్చు. దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే ఫుడ్ పాయిజనింగ్ దీర్ఘకాలిక గట్(జీర్ణనాళం) సమస్యలకి దారి తీస్తుంది. ఇన్ఫెక్షన్స్ బారిన పడే అవకాశం కూడా ఉంది. ఈ పరిస్థితి వచ్చినప్పుడు ఆందోళన పడకుండా తగిన సమయంలో చికిత్స తీసుకుంటే సులభంగా బయటపడొచ్చు. కొన్ని ఆహార పదార్థాలు పరిశుభ్రంగా తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఉంది. అవేంటో చూద్దాం..

**గొడ్డు మాంసం**

తరచుగా గొడ్డు మాంసాన్ని బర్గర్‌లో ఉపయోగిస్తారు. ఇది బయట బ్యాక్టీరియాని కలిగి ఉంటుంది. ప్యాక్ చేసిన గొడ్డు మాంసం కంటే తాజాగా ఉన్న వాటినే తినేందుకు ఉపయోగించాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్‌లో నిల్వ చేయడం వల్ల అవి బ్యాక్టీరియాకి ఆవాసాలుగా మారతాయి. అందుకే వాటికి బదులుగా తాజా మాంసం ఎంచుకోవాలి. నిజానికి సుషి ఆరోగ్యకరమైన ఆహారాల్లో ఒకటి. అయితే పచ్చి సుషి మాత్రం విషపూరిత ఆహారం. వీటిలో ఉండే బ్యాక్టీరియా, పరాన్నజీవులని చంపడానికి సుషిలను ఘనీభవించేలా చేస్తారు. అలా చేసిన వెంటనే వాటిని వండుకొని తినడం ఆరోగ్యానికి హానికరం. ఘనీభవించిన వెంటనే వాటిని వండుకోవడం వల్ల వాటిలోని బ్యాక్టీరియా అలాగే ఉంటుంది. అది ఫుడ్ పాయిజనింగ్‌కి దారి తీస్తుంది. ఓస్టర్ చేపలు చాలామంది ఎంతో ఇష్టంగా ఆరగిస్తారు. ప్రసిద్ధి చెందిన ఈ సీ ఫుడ్ ఆరోగ్యమకరమైన లైంగిక జీవితంతో ముడి పడి ఉంటుంది. గవ్వ లాంటి దాన్లో ఉండే ఈ చేప నీటిలో ఉండే బ్యాక్టీరియాను సులభంగా ఆకర్షించుకుంటాయి. వాటిని శుభ్రం చేసుకోకుండా తినడం వల్ల ఫుడ్ పాయిజనింగ్ అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది.

**జీన్స్ మొలకలు**

మొలకలు ఎంత ఆరోగ్యకరమో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. శాఖాహారులు ఎంతో ఇష్టంగా వీటిని తింటారు. కానీ ఇవి తినడం వల్ల కూడా ఫుడ్ పాయిజనింగ్ జరిగే అవకాశం ఉంది. బీన్స్ మొక్కలు వెచ్చని వాతావరణంలో పెరుగుతాయి. వాటిని వండుకోకుండా పచ్చిగానే తింటారు. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందించే సూపర్ ఫుడ్ అయినప్పటికీ ఇది ఫుడ్ పాయిజనింగ్‌కు దారి తీస్తుంది. అన్నీ రకాల పండ్లు, కూరగాయాలతో తయారు చేసే సలాడ్ అందరికి ఇష్టమైన ఫుడ్. కానీ దీనివల్ల కూడా ఆరోగ్యానికి హాని కలుగుతుంది అంటే నమ్మశక్యంగా లేదు కదా. కానీ ఇది నిజం. అయితే ముందుగా ప్యాక్ చేసిన సలాడ్ మాత్రమే అనారోగ్యకరం, విషపూరితం. సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (CDC) ప్రకారం గత దశాబ్దంలో 22 శాతం ఫుడ్ పాయిజనింగ్ కేసులు సలాడ్‌ల కారణంగా వచ్చాయట. ముందుగా ప్యాక్ చేసి మూసి ఉన్న బ్యాగ్‌లో వాటిని ఉంచడం వల్ల తేమగా ఉంటాయి. అవి తొందరగా బ్యాక్టీరియాని ఆకర్షిస్తాయి. ఏదిఏమైనా విద్యాసంస్థలోని హాస్టల్స్ లలో పెట్టే ఆహారం నాణ్యతతోపాటు పరిశుభ్రమైన ఆహారం పెట్టినప్పుడే విద్యార్థులు ఆరోగ్యకరమైన ఆహారం తిని, ఆరోగ్యంతో చదువులోను కెరీర్‌లోను చక్కగా రాణించగలరు. ఆదిశగా ప్రభుత్వాలు, పాలకవర్గాలు కృషి చేస్తాయని ఆశిద్దాం. ●




## మనసున్న ఎమ్మెల్యే



అది ఉత్తరప్రదేశ్ జిల్లా సంత్క బీర్ నగర్ జిల్లా ధనటా. అక్కడ విపిన్ మౌర్య అనే పేదింటి కుర్రాడి పెళ్లికి ఓ కల్యాణ మండపంలో ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. వరుడు కారులో మండపానికి వచ్చిన తీరు చూసి అక్కడున్న అతిథులంతా అవాక్కయ్యారు. ఎందుకో తెలుసా... విపిన్ పెళ్లి కొడుకులా ముస్తాబై మండపానికి వచ్చిన కారును డ్రైవ్ చేసుకొచ్చింది మరెవరో కాదు ధనటా ఎమ్మెల్యే గణేశ్‌చంద్ర చౌహాన్. సాధారణంగా ఎమ్మెల్యేలతో మాట్లాడటానికే అపాయింట్మెంట్ దొరకదు. అలాంటిది ఓ పేదింటి కుర్రాడి పెళ్లికి ఎమ్మెల్యే సాబ్ డ్రైవర్ అవతారం ఎత్తాడంటే బహుశా ఆ కుర్రాడు అతనికి బంధువనే అనుమానం రావచ్చు. నిజానికి విపిన్ కొన్నేళ్లుగా గణేశ్ చౌహాన్ దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గణేశ్ తన డ్రైవర్ విపిన్‌ను అతని ఇంటి నుంచి దాదాపు యాభై కిలోమీటర్ల దూరంలో ఉన్న పెళ్లి మండపానికి స్వయంగా డ్రైవ్ చేస్తూ తీసుకెళ్లి తన కృతజ్ఞతను చాటుకున్నాడు.

## వృద్ధులకు డిజిటల్ పాఠాలు



జమ్ము కశ్మీర్లోని కథువా జిల్లాలోని పలు వయోజన విద్యాకేంద్రాలకు వృద్ధులు వెళుతుంటారు. వారంతా పుస్తకాలతోపాటు స్మార్ట్‌ఫోన్, ట్యాబ్ల వంటివీ వెంట తీసుకెళుతున్నారు. వాళ్లను చూసినవారికి స్కూల్లోనే ఆన్లైన్ క్లాసులు వినడానికి వెళుతున్నారేమో అనిపిస్తుంది. నిజానికి వారంతా చదువు నేర్చుకోవడంతోపాటు డిజిటల్ పాఠాలనూ అభ్యసించడానికి వెళుతున్నారు. జమ్ముకశ్మీర్లోని ఆ ప్రాంతంలో సైబర్ నేరాలూ, పలు రకాల స్కామ్లూ ఎక్కువగా జరుగుతుండటంతో అందుకు కారణాలను విశ్లేషించారు విద్యావేత్తలు. కేవలం నిరక్షరాస్యత వల్లే అలాంటివి అధికంగా నమోదవుతున్నాయని తెలుసుకుని కథువా జిల్లాలోని అరవై ఏళ్ల దాటినవారంతా బడిబాట పట్టారు. వారంతా వయోజనవిద్యా కేంద్రాల్లో చదువుతోపాటు స్మార్ట్‌ఫోన్ల వాడకం, డిజిటల్ బ్యాంకింగ్ తీసుకోవాల్సిన జాగ్రత్తలూ, పేక్స్క్యాస్ గుర్తించడం.. తదితర విషయాలకు సంబంధించి పాఠాలు నేర్చుకుంటున్నారు. అందుకోసం దాదాపు మూడొందల పాఠశాలల్లో ప్రభుత్వమే తగిన ఏర్పాట్లు చేసింది.



## వేలాడే పుచ్చకాయలు

మన పుచ్చకాయ తోటల్లో పాదులు నేలపై పరచుకొని ఉంటాయి. పుచ్చ కాయలు నెలపైనే పెరుగుతాయి కదా. సౌతాఫ్రికాలో ఒక కంపెనీ పాలీహౌస్లలో పుచ్చ పాదులు నిలువుగా ఎగబాగుకుతున్నాయి. పుచ్చకాయలు వాటికి వేలాడుతున్నాయి. ట్రెల్లీస్ పద్ధతిలో పెరిగే టొమాటోల మాదిరిగా ఈ పుచ్చకాయలు వేలాడుతున్నాయి కదూ.. కాండీ బాల్ సీడ్స్ పుచ్చకాయలు కిలో నుంచి కిలోన్నర వరకు బరువు పెరుగుతాయి. అదేమాదిరిగా కిలో బరువు పెరిగే స్మైల్ మెలన్స్ (ఇదో రకం కర్బూజ) పండ్లను కూడా నిలువు తోటల్లో పెంచుతున్నారు. టొమాటోలు వంటి కాయలు బరువు తక్కువగా ఉంటాయి కాబట్టి తీగజాతి మొక్కలు మొయ్య గలుగుతాయి.



అయితే, ఇలాంటి నిలువు తోటలో పుచ్చకాయలు, కర్బూజ కాయల బరువు మొక్కలకు భారం కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్లాస్టిక్ నెట్ కవర్లతో కాయలను ప్లాస్టిక్ వైర్లకు కట్టిస్తున్నారు. ఖనిలువు తోటలో పెరిగిన పుచ్చకాయలను మేం త్వరలోనే అమ్మకానికి పెట్టబోతున్నాం. సౌతాఫ్రికా మార్కెట్లో మేమే ఫస్ట్‌ఖి అంటున్నారు ఆ కంపెనీ ప్రతినిది ఫ్రాంకోయిస్ పారీ, పాలీహౌసలు, నెట్హౌస్లలో, మేడపై ఇంటిపంటల్లో ట్రెల్లీస్ పుచ్చ, కర్బూజ సాగు తి సాధ్యమే అని గ్రహించాలి!



## చదవాలంటే సైకిల్ తొక్కాలి

వేలమంది చదువుకునే ఆ యూనివర్సిటీ విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యమిస్తుంది. టెక్నాలజీ అందుబాటులోకి వచ్చాక అందరూ దానికే సమయం కేటాయిస్తున్నారు. తప్ప వ్యాయామం గురించి పట్టించుకోవట్లేదని భావించింది.. అందుకే నెదర్లాండ్స్‌లోని యుట్రెక్ట్ యూనివర్సిటీ లైబ్రరీలో సైకిల్ డెస్క్ టాప్లను ఏర్పాటు చేసింది యాజమాన్యం. అక్కడ చాలా వరకూ పుస్తకాలు... ట్యాబులూ, ల్యాప్‌టాప్‌ల్లోనే అందుబాటులో ఉంటాయి. అందుకని వాటికి ఎప్పటికప్పుడు చార్జింగ్ పెట్టుకోవాల్సి ఉంటుంది. మరి, పుస్తకాలు చదువుకోవాల్సినవారే వాటికి ఛార్జింగ్ పెట్టుకోవాలి. అలాగని ప్లగ్ గుచ్చగానే చార్జ్ అయిపోవు ఆ ట్యాబులు కష్టపడి సైకిల్ తొక్కితేనే వాటికి ఛార్జింగ్ ఎక్కుతుందన్న మాట.

పూర్వం గ్రామీణ ప్రాంతాల్లో దారులు గోతులూ, గొప్పులతో ఉండేవి. ఆ దారిలో ఎడ్ల బళ్లపై ప్రయాణం సాఫీగా సాగేది కాదు. ఆ సమస్యకు పరిష్కారంగా దట్టంగా పెరిగిన నల్లేరు పాదులని తెచ్చి ఆ దారిలో వేసేవారట. దాంతో ప్రయాణం సాఫీగా సాగేది. అందుకే నల్లేరుపై బండి నడకలా... అనే సామెత వచ్చింది. బండి నడక సరే... నల్లేరుతో ప్రయోజనాల గురించి తెలుసుకుంటే మన ఆరోగ్యమూ అంతే సాఫీగా సాగుతుందంటున్నారు పోషకాహార నిపుణులు.

# ఆరోగ్యసిరి నల్లేరు

నల్లేరు సామెత వినడమే కానీ ఎప్పుడూ చూడలేదు అంటారా. దీన్ని గుర్తు పట్టడం చాలా తేలిక. పాదు మొక్క చిన్న ఆకులతో, కాండం చతురస్రాకారంలో ఉంటుంది. ఇది ద్రాక్ష కుటుంబానికి చెందిన మొక్క. అందుకే ఇంగ్లిష్లో వెల్డ్ గ్రేప్ అంటారు. చాలాచోట్ల హడ్జీజోడ్ అని కూడా అంటారు. హడ్డీ అంటే ఎముక. జోడ్ అంటే అతికించడం. ఇది విరిగిన ఎముకలని తేలిగ్గా అతికిస్తుంది. కాబట్టి హడ్డీజోడ్ అనీ, హడ్జోడ్ అనీ అంటారు. దక్షిణాదిన ఈ మొక్కని ఆహార రూపంలో తీసుకునే అలవాటుంది. అయితే ఎప్పుడోఒకసారి రోటిపచ్చడిగా మాత్రమే తినేవారు. ఇప్పుడు నల్లేరుతో చేసిన ఇడ్లీ, దోసె పొడులూ, పచ్చళ్లూ, వడియాలూ, అప్పడాలూ, జంతికలు వంటివి ఎక్కువగా వస్తున్నాయి. కాస్త తీపి ఇష్టం అనుకునేవారికి జామ్, బిస్కెట్లూ, చిక్కీలూ, జ్యూస్లూ, బెల్లం, గ్రీన్ రూపంలోనూ అందుబాటులో ఉన్నాయి. నలేదుతో చేసిన






ఉప్పు కూడా మార్కెట్లో దొరుకుతోంది. దీన్ని కూరలూ, వేపుళ్లతోపాటూ మసాలా పొడుల్లోనూ వేసుకోవచ్చు. ఏడాదిపొడవునా వాడాలనుకొనేవాళ్లకి నల్లేరు వడియాలు కూడా దొరుకుతున్నాయి. వీటిని చల్ల మిరపకాయల మాదిరిగా మజ్జిగ లో నానబెట్టుకుని ఆపై ఎండబెట్టి వడియాలుగా తయారు చేస్తారు. కావాల్సినప్పుడు నూనెలో వేయించుకో వడమే. ఇవి కూడా సూపర్మార్కెట్లలో దొరుకుతున్నాయి. అలాగే మార్కెట్లో ఎండిన నల్లేరు కాడలూ దొరుకుతున్నాయి. వీటిని సాంబార్లో, సూపు ల్లో వేసుకున్నా ప్రయోజనాలు అందుతాయి.

వేసుకున్నా ప్రయోజనాలు అందుతాయి.

## పాదుతో ప్రయోజనాలెన్నో

నల్లేరు ప్రయోజనాల్లో మొదటిది ఎముకల ఆరోగ్యం. మోకాళ్ల వాపులూ, వయసుతో పాటూ వచ్చే కీళ్ల సమస్యలకు ఇది చక్కని పరిష్కారం. ఎముకలు గుల్లబారకుండా చూస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రక్తం గడ్డకట్టకుండా చేసి, బ్రెయిన్ స్ట్రోక్స్ వంటివి రాకుండా అడ్డుకుంటుంది. మహిళల నెలసరి ఇబ్బందుల నుంచీ ఉపశమనం కలిగిస్తుంది. చిగుళ్ల ఆరోగ్యాన్ని కాపాడు తుంది. దీనిలోని విటమిన్ సి చర్మంలో సాగే గుణాన్ని పెంచి వయసు తగ్గిన భావన కలిగిస్తుంది. వ్యాధినిరోధకశక్తిని పెంచి సాధారణ అనారోగ్యాలు రాకుండా రక్షణ కవచంలా ఉంటుంది. మలబద్ధకాన్ని రాకుండా చూస్తుంది. గ్యాస్ట్రిక్ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. కాలిన గాయాలకు మనం అలోవెరా గుజ్జు రాసుకున్నట్టుగా దీని గుజ్జుని కూడా రాసుకోవచ్చు. పొట్టలోని వ్యర్థాలను బయటకు నెట్టేస్తుంది. దీన్ని ఏదో ఒక రూపంలో ఆహారంగా తీసుకొనేవారిలో ఆస్తమా వంటి సమస్యలు దూరంగా ఉంటాయి. ఇన్ని ప్రయోజనాలున్నాయి కాబట్టే నల్లేరుని ఇప్పుడు సప్లిమెంట్ల రూపంలోనూ వస్తున్నాయి. ఈ కాడతో చేసిన క్యాప్సూల్స్, పొడర్లూ, తైలాలూ, టింక్చర్లూ మందుల దుకాణాల్లో దొరుకుతున్నాయి. ఎంత మంచి ఆహారమైనా నిర్ణీత మోతాదులోనే తీసుకోవాలన్న విషయం తెలిసిందేగా. ఆరోగ్యపరంగా ఎన్నో ప్రయోజనాలు అందించే ఈ పాదు ఆర్నమెంటల్ ప్లాంట్గా ఇంటితోటకి అందాన్ని తీసుకొస్తుంది. ఎలాంటి వాతావరణంలో అయినా తేలిగ్గా పెరిగే ఈ మొక్కని కుండీలో నాటుకుంటే చాలు. పెద్దగా పోషణ లేకపోయినా తేలిగ్గా పెరుగుతుంది. ■



# బతుకు పుస్తకం

నీ



గాయపడ్డావో
జ్ఞాపకాలతో
బంధింపబడ్డావో
అవమానాల
వలలో చిక్కుకొన్నావో
తెలియని అయోమయ
స్థితిలో మునకలేస్తున్నావా?
నిన్ను నువ్వు చూడాలా
నువ్వు ఎక్కడ ఓడిపోయావో
ఆ చోటు నుంచి నిన్ను నువ్వు
చూడడం మొదలు పెట్టు.
నువ్వు ఏంటో అర్థం అవుతుంది
నీ గమ్యం ఏంటో తెలుస్తుంది
తల దించిన చోటే
తల ఎత్తే క్షణం నీ ముందు
ఆవిష్కరింపబడుతుంది.
ఆ క్షణాన్ని ఆయుధంగా మార్చుకొంటే
నీ జీవితం మరో జీవితానికి
ఆదర్శం అవుతుంది.
బతుకు పుస్తకంలో
చిరిగిపోయిన పేజీలు
ఎండిపోయిన అక్షరాలు
కొత్తగా మళ్లీ చిగురిస్తాయి
కొత్త ఆశయాలతో
ప్రపంచానికి గెలుపు
సువాసనలు వెదజల్లుతాయి
కొత్త చరిత్రకు నాంది ప్రస్థానం
నీ బతుకు పుస్తకం అవుతుంది.

**– లక్ష్మీ శ్రీనివాస్**


# ఎవర్ని ప్రశ్నించేది?



అందరు మనుష్యుల్లాగే
కనిపిస్తున్నారు, కానీ
ఏ వొక్కరి నీడ మనసున్న
మనిషిలా కనిపించడం లేదు.
ఆకారాల రూపంలో
మనుషులున్నారు
పలుకరింపు లేని కదలికలో
మనసుకందని దూరాల్లో
విశ్రాంతి లేని దినచర్యల మధ్య
కాలం కదిలిపోతుంది
బతకడం ఓ రొమాంటిక్
థ్రిల్‌గా మారిపోయింది.
ఇక్కడ మనుష్యుల్ని
వెదకడం అసాధ్యం
అలసిన జీవన స్వప్నం పైన
ఏ పూల వాన కురుస్తుంది
ఏ వేకువ జీవన స్వప్నమై
మానవుడు మానవుడిగా
ఉదయిస్తాడో
ఈ వేళ ఎవర్నీ ప్రశ్నించలేం.

**– రవి మాగంటి**


# కోరికల కల్పవల్లి



**ఈవారం కవిత్వం**

బోసినవ్వుల బుజ్జాయికి
అమ్మఒడిని మించినది లేదు.
బుడిబుడి నడకల పాపాయికి
బడిని మించినది లేదు
జాబిలిని చూపి గోరుముద్దలు
తినిపించేది
తీరుగా మనిషిగా మలిచేది తల్లి
కోరికలనీడేర్చే కల్పవల్లి
ఎన్ని జన్మలనెత్తిన తీర్చలేనిది
మాతృమూర్తి ఋణం
వినలేనిది, కనలేనిది
ఆ మాతృమూర్తి
అమృత భాషణం.

**– యలమంచిలి శివాజీ**



# అభయం

కరిగే మనసు ఎవరిక్కావాలి,
బండలా ఉంటేనే మేలు
కొండలా కదలకుండా ఉండొచ్చు.

చలనం
వేలి కొసల నుండి
జారిపోతుందనే భయం ఉండదు.

జ్వలనం
బూడిదలా మార్చేస్తుందనే
బాధ ఉండదు.

కదలిక
పాతాళానికి పడేస్తుందనే
అపోహ ఉండదు.

చలనశీలత మంచిదే
కానీ అంతకంటే
నిశ్చలత ఎల్లకాలం మంచిది,

అది
ఎవరికి వారికే
అభయహస్తం!

**- పుట్టి గిరిధర్**



13:13.qxd 12/10/2024 4:14 PM Page 1

# పుస్తక సమీక్ష



## అపురూపమైన జ్ఞాపకాల కలబోత

చెప్పగల 'కళ' ఉండాలి కాని విషయం ఏదైనా మనోరంజకంగా ఉంటుందని, పద్మాదాశరథి (జొన్నలగడ్డ పద్మావతి) తమ 'మనసు చెప్పిన ముచ్చట్లు'లో నిరూపించుకున్నారు. లోగడవీరు 'ఫేస్‌బుక్'లో పంచుకున్న మధ్యతరగతి అమ్మ జ్ఞాపకాలు, మామ్మగారు మా కుప్పం కథలకు పుస్తకం రూపం ఇది. నాటి అమ్మలు, అయిదా రుగురు పిల్లలు, వచ్చీపోయే బంధుజనాలు, వారాలు చేసుకుని చదివే అబ్బాయిలు, పండుగలు పబ్బాలు, ఇంటి వెనక ఖాళీస్థలం చెట్లూ చేమా, బడ్జెట్‌లో వెళ్లదీయాల్సిన రోజులు, అయినా, ఎక్కడా 'వెల్తి'పడని ప్రవర్తనలు, ఇవన్నీ నేటి సీనియర్ సిటిజన్ల తమ బాల్యాలను ఈ పుస్తకంలో తిరగతోడు కోవచ్చును. పెళ్లయి కాపురానికి ఉద్యోగానికి కొత్తగా వెళ్తే, ఇంటి ఓనర్ మామ్మగారు తల్లిగా ఆదరించి అలవర్చిన శుభ్రత, సాంప్రదాయాల పాటింపు నాటి పాఠకులకో గొప్ప జ్ఞాపకం. నేటి పాఠకులకు ఒక గొప్ప అనుభూతి. కర్ణాటక తమిళనాడు బార్డర్, టవును కుప్పంలో ఓ గ్రామీణ బ్యాంకు మేనేజర్‌గా వెళ్లి అక్కడి సంస్కృతి సాంప్రదాయాలు, భాషలోని వెరైటీని ఆసక్తికరంగా వివరించారు రచయిత్రి. ఆత్మ కథలు అందరూ చెప్పగలరు. చెప్పటం సులువు కూడా! కాని ఈ రచయిత్రిలా ఆకట్టుకునేలా చెప్పి మెప్పించటం ఈ రచయిత్రికి అబ్బిన ప్రత్యేకప్రతిభ అనవచ్చును. **(పద్మా దాశరథి రచనలు (మనసు చెప్పిన ముచ్చట్లు) జ్ఞాపకవ్యాసాలు, రచన: పద్మాదాశరథి, వెల: రూ 150, ప్రతులకు: అచ్చంగా తెలుగు, ఇతర ప్రముఖ బుక్‌హౌస్‌లు)** **– కూర చిదంబరం**

## సామెతలు ఆమెత-బిందు మాధవి




ఆమెత అంటే విందు. మద్దూరి బిందుమాధవి సామెతల మీద కథలతో, మన మనస్సుకు విందు చేయడం అభినందనీయం. పైగా ఇది ఆ అంశంమీద, ఆరవ పుస్తకంలో 40 కథల సమాహారం. నిత్యజీవితంలో సంభాషణల మధ్య పెద్దల నుంచి విన్నప్పుడు పూర్తిగా అర్థం కాకపోయినా, తర్వాత అవే సామెతలు సందర్భానుసారంగా దొర్లుతుంటాయి. రచయిత్రి చేపట్టిన ఈ ప్రక్రియ, మనమాతృభాషా పరిజ్ఞానాన్ని వృద్ధి చేస్తుంది. జీవన సత్యాలకు అద్దం పట్టే ఈ కథలు, సామెత ఆధారంగా కల్పించగలగటం రచయిత్రి సృజనాత్మక ప్రజ్ఞను సాక్షాత్కరింపచేస్తోంది. 'అయిన వారికి ఆకుల్లో'తో ఆరంభమై 'సూక్ష్మంలో మోక్షం' ఆఖరికథగా ప్రచురింపబడిన ఈ సంపుటి ఎంతో ఆసక్తికరంగా చదివింపచేయడమే కాకుండా భాషాజ్ఞానాన్ని సంభాషణా చాతుర్యాన్ని నేర్పిస్తుంది.

కొన్ని కథలకు ఆ సామెతలను వాడే సందర్భం, అర్థం కూడా కథారంభంలో యిచ్చారు. మాత్రం ఆధారంగా, నలభైరకాల పరిమళ శోభిత పుష్పాలను సాహితీహారంగా ఏర్చికూర్చిన బిందుమాధవి మద్దూరి కృషి ప్రశంసనీయం. ప్రతీకథలోను సమస్యలే కాకుండా ఉత్తమ కథారచయిత్రిగా సామెతల ఆధారంగా సమస్యలకు పరిష్కారం చూపించారు.

**(సామెతల ఆమెత, రచన: బిందుమాధవి, వెల: 150,ప్రతులకు: ఎమ్.బిందుమాధవి, ఫ్లాట్ నం.402, శ్రీముఖ రెసిడెన్సీ, ఇం.నం. 8-3-1027/2/ఎ, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్)**

**– యర్రమిల్లి**

'సారస్వత భాస్కర' ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణకి ఈ పుస్తకం కవి అంకితం చేసారు. అప్పాజోస్యుల వారు సుగణాఢ్యశతకం, మహాదేవి మత్తేభ తారావళి దివాకరవృత్త తారవళి. పావక వృత్తతారావళి, సుజలవృత్త తారావళి, వసుధరావృత్త తారావళి, అపరోక్షానుభూతి లాంటి పద్యకృతులను ప్రకటించిన ప్రౌఢకవి. వీరిపై కావ్యాలపై సమీక్షను గురుశిష్యుల సంభాషణారూపంలో 6భాగాలుగా రాసారు. ప్రముఖ కవుల పద్యాలను ఈ సంభాషణల్లో చర్చించడం చాలాబాగుంది.



## పద్యప్రియులను అలరించే పుస్తకం

అప్పాజోస్యుల వారు ఆంధ్రావిశ్వవిద్యాలయం (విశాఖలో) మ్యాథెమాటిక్స్, ఫిజిక్స్‌లో మాస్టర్ డిగ్రీ చేసారు. జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్శిటి నుండి ఫిజిక్స్‌లో డాక్టరేట్ పట్టాపొందారు. పరిశోధన విద్యార్థికి గైడ్ ఇచ్చే మార్గదర్శనం చేసిన తీరు మనం చూడగలం. అనుబంధంగా వివేక చూడామణి తేటగీతుల నొసగించి తీపి గూర్చి, సాహితీప్రతులు అప్పాజోస్యుల వారు అంతశ్చరయోగి అంటూ అనుమాండ్ల వారి అభిప్రాయాలు ముద్రించారు. పద్యప్రియులను ఎంతో అలరిస్తుంది ఈ పుస్తకం అనుమాండ్ల భూమయ్య కృషి అభినందనీయం.

**(అప్పాజోస్యుల పద్యావలోకనం, రచన: ఆచార్య అనుమాండ్ల భూమయ్య, వెల: రూ 100, ప్రతులకు: మనస్వినీదేవి, ఫ్లాట్.519, బ్లాక్-ఏ, అపురూప జగపతి హైట్స్, ఆదర్శనగర్, ఉప్పల్, హైదరాబాద్)**

**– తంగిరాల చక్రవర్తి**

బొమ్మగాని వెంకటయ్య కమ్యూనిష్టు నాయకుడు. ఎన్నో రజాకార్ల నిర్బంధాలను ఎదుర్కొని, రహస్య జీవితం గడిపిన ధీరుడు. సూర్యాపేట బొడ్రాయి దగ్గర ప్రాణాలకు తెగించి ఎర్రజెం

## ఒక యోధుడి కవితాత్మక గాథ



డాను ఎగరేసిన ధైర్యవంతుడు. గీతకార్మికుల హక్కు ల్ని సాధించి పెట్టిన కార్యశూరుడు. ధర్మబిక్షం సోదరుడు. వెంకటయ్య జననం, ఆయనకు కుటుం బంతో వున్న అనుబంధం ఆయన వ్యక్తిత్వ ఔన్న త్యం, త్యాగనిరతిని శ్లాఘిస్తువెంకటయ్య కుమారుడు, కవి బొమ్మగాని నాగభూషణం 50 కవితలతో కవితాంజలి ఘటిస్తున్నారు. 'పుట్టింది గౌడకులం/ చేపట్టింది కల్లగీత వృత్తి జీవనం/ నియమనిష్ఠల జీవనానికి/ క్రమశిక్షణకు మారుపేరు'గా వెంకటయ్యను అభివర్ణిస్తారు నాగభూషణం. 'బడిలో పెద్దగా/ చదివిందంటూ ఏమీలేదు/ మహా అయితే/ పెద్ద బాలశిక్ష తప్ప' అయితేనేం? ఆదర్శవంతమైన జీవన విధానం ఆయనది. ముని మనవడితో వెంకటయ్య ఆత్మీయబంధం సదాస్మరణీయమంటారు కవి. వెంకటయ్య నాయకత్వంలో సూర్యాపేట ఎర్రబాట పరిచిందనీ, గ్రామరక్షకదళ నిర్మాణం జరిగిందనీ, భువనగిరితో ఆంధ్రమహాసభ విజయవంతం అయిందనీ, ఊతకర్రతోడు.. కౌలురైతుల ఉద్యమం లో బాటు దొరల ఢీకొట్టిన గీతన్నల ఉద్యమం స్ఫూర్తిదాయకమనీ పలు చారిత్రాత్మక సంఘటనలను గుర్తుకు తెస్తారు నాగభూషణం.

**(స్వాతంత్ర్య సమరయోధుడు బొమ్మగాని వెంకటయ్య, రచన: బొమ్మగాని నాగభూషణం, వెల: రూ 100, ప్రతులకు: నవచైతన్య బుక్‌హౌస్)** **– రమణ వెలమకన్ని**

# ఉద్యాన నగరి బెంగళూరు

**మనదేశంలో ఉద్యానవనాల నగరంగా ఖ్యాతినార్జించిన సుందర నగరం బెంగళూరు. భారతదేశ మహానగరాల్లో ఒకటైన బెంగళూరు కర్ణాటక రాష్ట్ర రాజధానిగా భాసిల్లుతోంది. దీన్నే 'ఇండియన్ సిలికాన్ వ్యాలీ', 'హరిత నగరం', 'పబ్ సిటీ', 'స్పేస్ సిటీ ఆఫ్ ఇండియా', 'గార్డెన్ సిటీ' ఇలా పలు ముద్దు పేర్లతో పిలుస్తుంటారు. దీన్ని ఒకప్పుడు కల్యాణపుర, కళ్యాణపు (మంచి నగరం), దేవరాయనగర అని పిలిచేవారు. ఇది ప్రపంచంలో 27వ అతి పెద్ద నగరంగా ప్రసిద్ధి చెందింది.**

షేక్ అబ్దుల్ హకీం జాని

ఇక్కడ నెలకొన్న పచ్చని ఉద్యానవనాల కారణంగా సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియా అని పేరొందింది. హోయసల రాజవంశానికి చెందిన 'వీర భల్లాల' అనే రాజు ఓసారి వేటకు వెళ్ళి అడవిలో దారితప్పాడట. ఆకలితో అలసిన ఆ రాజుకు ఒక వృద్ధురాలు ఉడికించిన చిక్కుళ్ళను ఇచ్చి ఆకలి తీర్చిందట. ఆకలి తీరిన ఆ రాజు ఈ ప్రాంతాన్ని 'బెండకాళ్ళ' ఊరు అని పిలిచాడట. కాలక్రమేణా అది బెంగళూరుగా మారింది. దక్షి ణ భారతదేశానికి చెందిన అనేక రాజవంశీకులు క్రీ. శ. 1537 వరకు బెంగళూరును పాలించారు. విజయనగర సామ్రాజ్యం లో సేనాధిపతి అయిన కెంపగౌడ 400 ఏళ్ళ క్రితం బెంగళూరు నగరాన్ని నిర్మాణానికి శ్రీకారం చుట్టాడు. నాటి చక్రవర్తి అచ్యుత రాయలు అనుమతితో క్రీ.శ. 1537లో ఇప్పటి నీటి మార్కెట్ ఎదురుగా ఒక మట్టికోటను నిర్మించి దానికి బెంగళూరు అని నామకరణం చేశాడు. ఆ తరువాత అచ్యుతరాయలు ఇతనికి అనేక జాగీరులు ఇచ్చాడు. ఆ జాగీరుల నుండి వచ్చిన ధనంతో కెంపగౌడ అనేక దేవాలయాలు నిర్మించారు. బసనం గుడిలో నంది దేవాలయం, గనిపురంలో గని గంగాధరేశ్వర వంటి ఆలయాలతో పాటు నగరానికి నాలుగు దిక్కులా పెద్ద పెద్ద బురుజులు నిర్మించాడు. ప్రస్తుతం బెంగళూరు ఈ హద్దులు దాటి సువిశాల నగరంగా విస్తరించింది. 1966లో కర్నాటక రాష్ట్రం ఏర్పడి బెంగళూరు రాజధానిగా విరాజిల్లుతుంది.



**భారీ పరిశ్రమల కేంద్రం** : బెంగళూరు నగరానికి మొట్టమొదట 1906లో విద్యుచ్ఛక్తి సరఫరా అందించారు. దీంతో భారీ పరిశ్రమలు ఇక్కడ స్థాపించారు. ది హిందుస్థాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఫ్యాక్టరీ, ది హిందుస్తాన్ మెషీన్ టూల్స్ ఫ్యాక్టరీ, ది భారత్ ఎలక్ట్రానిక్స్, ది ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ ఇత్యాడ్ అనేక భారీ పరిశ్రమలు, వ్యాపార కేంద్రాలు బెంగళూరు ఆర్థికాభివృద్ధికి దోహదపడినాయి. కర్నాటకలో ప్రసిద్ధి చెందిన షారావతి హైడ్రో ఎలక్ట్రిక్ స్టేషన్, షిమోగా సమీపాన గల ఓక్ పవర్ స్టేషన్ నుండి బెంగళూరుకు విద్యుచ్ఛక్తి సరఫరా అవుతుంది..

**అద్భుత భవనం విధానసౌధ**

బెంగళూరులోని సుందరమైన నిర్మాణాల్లో ఒకటి విధానసౌధం ఐదంతస్తుల ఈ అద్భుత భవనం. ద్రవిడ భవన నిర్మాణ చాతుర్యానికి ప్రతీకగా కనిపిస్తుంది. ద్రావిడ భదన నిర్మాణ చాతుర్యానికి అద్దంపట్టే విధంగా దీన్ని నిర్మించారు. విధానసౌధ మధ్యలో డోమ్స్ పై భారత జాతీయ చిహ్నామైన ఒకదాని వెనుక మరొకటి అనుకుని ఉన్న నాలుగు సింహాల శిల్పం అత్యంత రమణీయంగా శిల్పీకరించారు. మనదేశ స్వాతంత్ర్యానంతరం నిర్మించబడిన ఈ భవనంలో కర్నాటక రాష్ట్ర శాసనసభ, సచివాలయం, అనేక ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో కాటివెట్ గదులు చందనపు చెక్కతో తయారుచేశారు. విధాన సౌదను సాయంత్రం 5.30 నుండి 6.30 వరకు చూడటానికి పర్యాటకులకు అవకాశం కలించబడింది.

**కబ్బన్ పార్క్:** రమారమి మూడు వందల ఎకరాల వైశాల్యంలో అమరిన సుందర ఉద్యానవనం కబ్బన్ పార్క్, 183 1860 వరకు మైసూరు చీఫ్ కమీషనర్గా ఉన్న సర్ మార్క్ కబ్బన్ పేరుతో ఏర్పాటు చేయబడిన ఈ అందాల ఉద్యాన ఆకుపచ్చని బయళ్ళు విశ్రాంతి తీసుకోవడానికి అనువైన సౌకర్యాలు ఉన్నాయి. ఇది బెంగళూరు మహానగరానికి మరి వీది. స్టేట్ లైబ్రరీని, నెర్రటి గోతిక్ రూపాన్ని, అనేకమంది మహనీయుల విగ్రహాలతోపాటు రాత్రిపూట రంగు రంగుల దీపాల తో, వాటర్ ఫౌంటెన్ల అందాలతో దీని శోభ ద్విగుణీకృతంగా కనిపిస్తుంది.

**లాల్బాగ్:** హైదర్ అలీ, అతని కుమారుడు మైసూర్ పులి టిప్పుసుల్తాన్ 1760లో అంకురార్పణ చేసిన బొటానికల్ గార్డెస్ తదీనినే లాల్బాగ్ అంటారు. ఇది 240 ఎకరాల విస్తీర్ణంలో నెలకొని ఉంది. ఇక్కడ అనేకరకాల పూలమొక్కలు, వందలా ఏళ్ళనాటి పెద్దపెద్ద వృక్షరాజులు ఉన్నాయి. ఈ ఉద్యానవనం, మధ్యలో, గ్లాస్ హౌస్ ఉన్నది. ఇందులో ఏడాదికి రెండుసార్లు పుష్ప ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు. సుందరంగా నిర్మించిన ఈ అద్దాల మందిరంలో దేశ విదేశాలకు చెందిన పుష్పాలను తిలకించ వచ్చు. 1889లో ప్రిన్స్ ఆఫ్. దీనితో పాటు పద్య సరోవరం, టీర్పార్క్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.. లాల్ బాగ్‌లో పలు రకాల యాపిల్ చెట్లు, ద్రాక్ష, సపోటా, మగ్నోలియన్, బాండ్ స్టాండ్ గార్డెన్, సైప్రస్ గార్డెన్, రోజరీ గార్డెన్ అత్యాది చెట్లు ప్రత్యేక ఆకర్షణ అని చెప్పవచ్చు. లాల్బాగ్లో టిప్పుసుల్తాన్ స్వయంగా నాటిక అనేక చెట్లు ఇక్కడ ఉన్నాయి. ముఖ్యంగా అనాటి రెండు మామిడి చెట్లు నేటికీ పర్యాటకుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి.

**ఇస్కాన్ దేవాలయం:** ప్రపంచ ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణుని ఆలయమే ఈ ఇన్స్కాన్ దేవాలయం. అంతర్జాతీయ ఆధ్యాత్మిక సంస్థ ఇక్కడ ఈ ఆలయాన్ని నిర్మించింది. నూతన సాంకేతికత, ఆధ్యాత్మిక సమ్మేళనానికి ప్రతిరూపం ఇస్కాన్ దేవాలయం. కొండపై కెక్కి ప్రధాన గోపురంలోకి ప్రవేశించి కొంతదూరం వడిని వెళితే పైవముఖ ఆలయమైన రాధాకృష్ణ చంద్ర కోవెలను తిలకించను వచ్చు. ఆ తరువాత శ్రీ ప్రహ్లాద నరసింహాలయం, కలియుగ దైవమైన శ్రీ వెంకటేశ్వర ఆలయం చూదవచ్చు. భారతదేశంలోనే 3.బెంగళూరు ఇస్కాన్ ఆలయం అతి పెద్దదని చెప్పవచ్చు. అక్షయపాత్ర పథకం పేరుతో ఇక్కడ ప్రతిరోజు అన్న ప్రసాదాన్ని భక్తులకు ఉచితంగా అంది స్తున్నారు. కృష్ణ మందిరం చుట్టు ప్రక్కల ప్రజలెవ్వరూ ఆకలితో అలమటించరాదనే సదుద్దేశ్యంతో ప్రతిరోజు అనేక వేలమంది గ్రామీణ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఈ పథకం క్రింద సరఫరా చేస్తున్నారు. మానవ సేవయే మాధవ సేవ అన్న పేరుతో ఇస్కాన్ పేద విద్యార్థులకు చేయూతనిస్తుంది.

**బెంగళూరు ప్యాలెస్:** దీన్ని ఇంగ్లండులోని విండ్సర్ కాసిల్ యొక్క చిన్న నమూనాలాగా ఉండేటట్లు నిర్మించారు. బెంగళూరులోన సెంట్రల్ ఉన్నత పాఠశాలకు చెందిన తొలి ప్రిన్సిపల్ అయిన రెవరెండ్ గారెట్ దీన్ని నిర్మించారు. ఈ రాజప్రాసాదం 1862లో ప్రారంభమై 1944లో పూర్తైనది. ఆ తరువాత 1884లో మైసూర్ మహారాజు చామరాజ వడయార్ దీనిని కొని అనేక మరమ్మత్తులు చేసి అభివృద్ధి చేశారు. ప్రస్తుతం మైసూరు రాజ కుటుంబీకుల వారసుడైన శ్రీకంఠదత్త నరసింహరాజు వడయార్ అధీనంలో ఈ కోట ఉంది. ఇటీవలే శ్రీకంఠదత్త ఈ కోటను పునర్నిర్మించారు. ఈ రాజ ప్రాసాదాన్ని చూడాలంటే రుసుము చెల్లించవలసి ఉంటుంది. జవహర్ లాల్ నెహ్రూ ప్లానిటోరియం గ్రహాలను, నక్షత్రాలను, విశ్వాన్ని సౌరకుటుంబ అద్భుత రహస్యాలను చూడటానికి ఇది సరైన చోటు.



**మోక్షగుండం జన్మస్థలం:** నంది హిల్స్ వెళ్ళే దారిలో ముద్దెనహళ్లి అనే గ్రామం ఉంది. డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇక్కడే జన్మించారు. మన దేశంలో ప్రసిద్ధి చెందిన ఇంజనీర్లలో ఈయన ఒకరు విశ్వేశ్వరయ్య గారి నివాస గృహాన్ని నేదు. మ్యూజియంగా మార్చారు. దీన్ని విశ్వేశ్వరయ్య పారిశ్రామిక, వైజ్ఞానిక మ్యూజియం అని పిలుస్తారు. బెంగళూరు హైకోర్టు భవనం, నేతాజీ సుభాష్ చంద్రబోస్ భవంతి, ప్రభుత్వ మ్యూజియం, హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ వారి మ్యూజియం, సిటీ రైల్వేస్టేషన్ ఇత్యాది నిర్మాణాలు దర్శనీయ స్థలాలు.

**విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం:** మీ పిల్లవాడు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇష్టపడినట్లైతే తీసుకెళ్లడానికి సరైన ప్రదేశం ఇది. మ్యూజియంలో రైట్ సోదరుల 1903 విమానానికి ప్రతిరూపం కూడా ఉంది. డైనోసార్లు, సౌండ్ వేవ్స్, టచ్ అండ్ ప్లే పియానో, ఫిమిస్సింగ్ బాడీఫి ఫ్రూట్ ఫైల్ అన్నీ సైన్స్ ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి ఆసక్తికరమైన అంశాలు ఉన్నాయి. నగర్ మార్కెట్ సమీపాన కృష్ణ రాజేంద్ర రోడ్లో టిప్పుకోట ఉన్నది. రెంపగౌడ 1637లో కేవలం మట్టి గోడలతో దీన్ని నిర్మింపజేయగా టిప్పుసుల్తాన్ కాలంలో అభివృద్ధిపర్చాడు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ కోట బ్రిటిషు వారికి, టిప్పుసుల్తానుకు మధ్య జరిగిన యుద్ధాల్లో కొంత మేర నష్టాలు చవిచూసింది.

**గంగాధరేశ్వర దేవాలయం:** ప్రతి సంవత్సరం మకర సంక్రాతి పర్వదినాన సూర్య కిరణాలు ఈ ఆలయం ముందు ఉన్న దాతి నంది కొమ్ములగుండా గుహ అంతర్భాగాన ఉన్న దేవుని విగ్రహంపై పడగాయి. ఇదే గంగాధరేశ్వర దేవాలయ ప్రత్యేకత.

**సరోవరాలు జలాశయాలు:** బెంగళూరు నగరానికి 35 కి.మీ. దూరాన చామరాయసాగర్ రిజర్వాయర్, అక్కడే అర్కావతి నది మీద ఆనకట్ట చూడవచ్చు. 69 కి.మీ. దూరాన కణ్వ రిజర్వాయర్ మంచి విహార స్థలం. 29 కి.మీ. దూరాన హేసరగుట్ట సరోవరం ఉంది. ఇవి విహారస్థలాలుగా ప్రసిద్ధి పొందినవి. బన్నేరఘట్ట

**జాతీయోద్యానవనం:** బెంగళూరుకు 20 కి.మీ. దూరాన బన్నే రఘట్ట జాతీయోద్యానవనం నెలకొనివుంది. దీన్ని 1971లో స్థాపించారు. 105 చ.కి.మీ. వైశాల్యంలో అటవీశాఖలోని అనెకల్లు ప్రాంతపు పది రిజర్వు అడవులు కూడా కలసి ఉంటాయి. ఈ అడవుల్లోని కొల్లెగ్ నుండి ప్రతి ఏటా ఏనుగుల సమూహం తమిళనాడు అడవులకు వలస పోతుంటాయి. ఈ ఉద్యానవనంలో గంధం, టేకు, చింత, నిమ్మ ఇత్యాది వృక్ష జాతులు కనిపిస్తాయి. ఇక్కడ అపారమైన వెదురుసంపద ఉంది. కొంతమేరకు ఈ వెదురుసంపద ఏనుగులకు ఆహారం అవుతుంది.

**వినోద ఉద్యానవనాలు:** బెంగళూరులో వినోదాన్ని అందించే అయిదు ఉద్యానవ నాలలో స్నో సిటీ ఒకటి. దీన్ని కృత్రిమ మంచుతో, పర్యావరణ అనుకూల పద్ధతులను ఉపయోగించి సురక్షితంగా రూపొందిం చారు. భారతదేశంలోని అత్యుత్తవ ఇండోర్ స్నో పార్క్గా ప్రసిద్ధి చెందింది. ఇందులో 5డి థియేటర్ కూడా ఉంది. మరోక వినోద కేంద్రం ఫన్ వర అమ్యూజ్మెంట్ పార్క్, ఇక్కడ కిడ్స్ రైడ్స్, ఫ్యామిలీ రైడ్స్, అడల్ట్ రైడ్స్, ఆడ్రినలిన్ రైడ్స్ ఉన్నాయి. ఇక్కడ కార్టూన్ సిటీ, మిస్ గోల్ఫ్, మైల్డ్ పార్క్ ప్రసిద్ధిగాంచినవి. ఇంకా ఇక్కడ థీమ్ పార్క్ చూడదగినవి. ధర్మరాజ దేవాలయం, బసవ దేవాలయం, విశ్వేశ్వరపురంలోని సుబ్రహ్మణ్యస్వామి వెండి రథోత్సవం, ఇత్యాదిని నిర్వహించబడతాయి. బెంగళూరు చుట్టు పక్కల తిలకించవలసిన ప్రదేశాలు అనేకం ఉన్నాయి. నందిహిల్స్ వేసవి విశ్రాంతి కేంద్రంగా పేరొందింది. బెంగళూరుకులో నందీ హిల్స్ చూడదగిన ప్రదేశం. సముద్రమట్టానికి 4851 అడుగుల ఎత్తులో ఉంది. ఇది అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో ఉంది.

దక్షిణ భారతదేశంలోని నయాగరా జలపాతం.! అని పిలుచుకునే హోగెనక్కల్ జలపాతం తప్పక సందర్శించదగినది. బెంగళూరు సమీపాన ఉన్న హిల్ స్టేషన్ ఏర్కాడ్, ఇది తప్పక సందర్శించదగినది. ఇది సముద్రమట్టానికి 1515 మీటర్ల ఎత్తులో ఉంది. ఇంకా లుంబినీ గార్డెన్స్, ఫన్ వరల్డ్, మారతహళ్ళి, బిటియం లే అవుట్, దోమలూరు, జయనగర్, కోరమంగళ, బసవన గుడి, బనశంకరి, రాజాజీ నగర్, నాగర్భవి, వైట్ఫీల్డ్, సదాశివనగర్, వందలాది ఐటి కంపెనీలు, మోట్రోరైలు ■



కథ

# చివరి పరీక్ష



భువనగిరిని విజయశేఖరుడు పరిపాలిస్తు విద్యాదాతగా పేరుపొందాడు. అతని ఆర్ధిక సహకారంతో సదానందుడు రాజ్య శివార్లలలో గురుకులం నిర్వహిస్తున్నాడు, సదానందుని నిర్వహణలో ఇప్పుడు నిరాదరులకు ఆశ్రమం నిర్మించారు. దాని నిర్వాహణకు సేవాభావం, నిజాయితీ కలిగిన ఇద్దరు వ్యక్తులు వసరమైనారు. ఆపదవికి పలువురు వచ్చారు. పలు విదాల పరీక్షలు జరిపి చివరిగా నలుగురిని ఎంపిక చేసారు.

'నాయనలారా పొద్దుపోయింది ఈరాత్రికి మీ నలుగురు ఇక్కడి విక్రమించండి. మీకు ఈరాత్రికి కావలసిన అన్ని ఏర్పట్లు మా శిష్యులు చేస్తారు'. 'అన్నా సదానందుడు, గణపతి వీరికి కావలసిన ఏర్పాట్లు చేయించు' అన్నాడు.

ఆయువకులకు ఇద్దరికీ ఒకగదిలో, మరో ఇద్దరికి మరో గదిలో మందాలు ఏర్పాటు చేయబడ్డాయి. భోజనానంతరం, మొదటి గదిలోనికి వెళ్ళిన సదానందుని శిష్యుడు గణపతి "నాయనలారా మీపేర్లు'అన్నాడు. "నాపేరు రామయ్య, ఇతని పేరు సోమయ్య' అన్నాడు ఆగదిలోని యువకుడు."నేను సదానందులవారి ప్రదమ శిష్యుడను, ఈ నిరాదరుల ఆశ్రమ నిర్వాహణా బాధ్యత మీకు వచ్చేలా చేస్తాను మీరు పదవి చేపట్టిన అనంతరం చేరి ఐదువందల రూకలు నాకు ఇవ్వాలి ఇదిమీకు సమ్మతమేనా?' అన్నాడు గణపతి. సమ్మతమే అని తలఊపారు ఆఇరువురు యువకులు.

రెండో గదిలోనికి వెళ్ళిన గణపతి "నాయనలారా మీపేర్లు' అన్నాడు.

"నాపేరు శివయ్య, ఇతని పేరు రంగనాథం' అన్నాడు. మొదటిగదిలో చెప్పినమాటలే వీరికి చెప్పాడు.

"పెద్దలు మన్నిందాలి మేము లంచం ఇవ్వం తప్పుడు మార్గంలో పొందే పదవీ జీవితాంతము తప్పుడు మార్గాన్నే నడిపిస్తుంది. మా నిజాయితీకి తగిన ఉద్యోగం ఇక్కడ కాకుంటే ఎక్కడైనా, ఎప్పుడైనా లభిస్తుంది తమవంటి వారికి ఈ తప్పుడు పని తగదు' అన్నారు. "మీ ఇష్టం' అని గణపతి వెళ్ళి పోయాడు.

తెల్లవారుతూనే కాలకృత్యాలు తీర్చుకుని ఒకుటీరంలో సదానందుని కలసారు. ఇంతలో కుటీరం ముందు ఉన్న రహదారిన వెళుతున్న అందుడు ముందుకు పడిపోయాడు. అతని చేతి సంచిలోని వస్తువులన్ని రహదారిపై పడ్డాయి. అదిచూసిన శివయ్య, రంగనాదాలు పరుగున వెళ్ళి ఆవృద్ధుని లేవదీసి, అతని సరుకులను చేతి సంచిలో పెట్టి, చేతికర్రతోపాటు ఆ వృద్ధునికి అందించారు. అదే దారిన వెళుతున్న ఒవ్యక్తి అయ్యా ఈ వృద్ధుడు మా ఊరివిడే నేను ఇతన్ని మాఊరు తీసుకు వెళతాను అని వృద్ధుడు వెళ్ళిపోయాడు. శివయ్య, రంగనాథం కుటీరంలోనికి వచ్చి తమ ఆసనాలపై కూర్చున్నారు. నాయనా రామయ్య, సోమయ్య రహదారిలో అంధుడైన ఆ వృద్ధుడు పడిపోతే మీలో ఎటువంటి చలనం లేదు చూస్తూ ఉండిపోయా్రఉ. శివయ్య, రంగనాధాలు పరుగున వెళ్లి ఆ వృద్ధుడిని ఆదుకున్నారు. అంధుడైన ఆ వృద్ధుని నేనే ఏర్పాటు చేయించాను. గత రాత్రి మా గణపతి అడిగిన లంచం ఇవ్వడానికి మీరు సమ్మతించినపుడే మీరు నిజాయితీ పరులుకారు అని తెలిసిపోయింది.

మనిషికి దయా, కరుణా, జాలి, పాపభీతి వంటి సులక్షణాలు ఉండాలి. మానవత్వం, సవమారభావ, సేవాగుణం, నిజాయితీ కలిగిన శివయ్య, రంగనాధాలను చివరి పరీక్షలో నెగ్గిందుకు ఈ పదవికి ఎంపిక చేస్తున్నాను' అన్నాడు సదానందుడు.

**– బెల్లంకొండ నాగేశ్వరరావు**









## బాలగేయం

### అక్కా బడికెళ్దాం



అక్కా అక్కా బడికెళ్దాం
ఎక్కాలన్నీ నేర్చుకుందాం
పక్కపక్కనే కూర్చుందాం
మక్కువతోనే చదివేద్దాం
నక్కినక్కి చూసే పద్ధతి
దూరం దూరం
జరిపేద్దాం
కంఠాపాఠం చేసి చక్కగా
పరీక్షలు మొత్తం
రాసేద్దాం
బోలెడన్ని మార్కులతోటి
అమ్మనాన్నకు చూపిద్దాం
మనపై పెట్టిన ఆశలన్నీ
మనస్ఫూర్తిగా తీర్చేద్దాం
ఒక్కొక్క మెట్టు
ఎక్కుతూ
చదువులో బాగా
రాణిద్దాం
శ్రద్ధగా పుస్తకం చేతబట్టి
పాఠాలన్నీ తిరేగేద్దాం
పదుగురికి ఆదర్శంగా
మంచి పేరు
సంపాదిద్దాం
పెద్దయ్యక సమాజానికి
చక్కగా
ఉపయోగపడదాం

– నరెద్దుల రాజారెడ్డి

## హలో ఫ్రెండ్...



చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

### గిరీష్ అంకుల్ సమాధానాలు

- ఎస్.కౌసల్య, కేసముద్రం

**ప్రశ్న: ఎలర్జీ ఎందువల్ల వస్తుంది?**

**జవాబు: కౌసల్య!** ఫలానా పదార్థం తింటే ఎలర్జీ వచ్చిందని చాలా మంది చెబుతుంటారు. మానసిక బలహీనతలు, మనోవేదనలతో బాధపడేవారికి ఎలర్జీ త్వరగా వస్తుంది. అనేకమంది తమకు 'ఇది' పడదని, 'అది' పడదని చెప్తుంటారు. 'ఎలర్జిన్' అనే ఒక రకమైన మాంసకృత్తి ఉంటుంది. ఇది నీటిలో, గాలిలో, ఆహారంలో ఎక్కడైనా ఉంటుంది. ఇది శరీరాన్ని తాకినా, లోపలికి ప్రవేశించినా, శరీర కణాలు భిన్న రీతిలో వ్యవహరించి కొన్ని అవలక్షణాలను కలిగిస్తాయి. ఈ పరిస్థితినే 'ఎలర్జీ' అని అంటారు. ఎలర్జీ కారణంగా శరీరంలోని ఏ అవయవమైనా రుగ్మత పాలవచ్చు. చర్మం మీద దద్దుర్లు, వాపు, దురద, సన్నని మచ్చలు ఎరుపెక్కడం మొదలైన లక్షణాలు దాపురించవచ్చు. ఎలర్జీకీ, మానసిక పరిస్థితులకు కూడా సంబంధం లేకపోలేదు.

- పి.యశస్వి, విజయవాడ

**ప్రశ్న: వేలిముద్రలతో పోలీసులు ఎలా పరిశోధన చేస్తారు?**

**జవాబు: యశస్వి!** నేరం జరిగిన వెంటనే నేర స్థలాన్ని పరిశీలించిన 'క్లూస్ టీమ్' సభ్యులు ముందుగా అక్కడి వేలిముద్రలను సేకరిస్తారు. ఆ తరువాత నేరం జరిగిన ఇంటి కుటుంబ సభ్యుల వేలిముద్రలను తీసుకుంటారు, వాటిని పోలుస్తారు. ఘటనా స్థలంలో కొత్త వేలిముద్రలు కనిపిస్తే వాటిని కంప్యూటర్ లో పొందుపరిచి పాత నేరస్థుల వేలిముద్రలతో పోలుస్తారు. తద్వారా నేరస్థులను గుర్తిస్తారు. ఆధారాలు ఉంటే డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందిస్తారు. ఇక, వేలిముద్రలకు గల పరిమితులను పరిశీలి స్తే- నున్నటి తాళం మీద మాత్రమే ముద్రలు పడతాయి. గరుకు తాళాల మీద వేలిముద్రల ను తీయడం అసాధ్యం; చేతులకు గ్లౌజులు వాడితే ముద్రలు పడవు; చేతి ముద్రలను తుడిచివేస్తే ఉపయోగం వుండదు; నేరం జరిగిన ప్రాంతాన్ని అందరూ ముట్టుకుంటే వేలిముద్రలు చెరిగిపో తాయి. ఈ అంశాలన్నిటినీ దృష్టిలో ఉంచుకునే పోలీసులు వేలిముద్రల ద్వారా నేరస్థుల ఆచూకీని కనిపెట్టడానికి ప్రయత్నిస్తారు.





# చెరువు మధ్యలో దీవి

ఏ పంటకైనా నీళ్లు అవసరం. నీరే ప్రతిజీవికి ప్రాణం. మరి పంటలకు నీరు లేకపోతే చేతికొచ్చిన పంట దెబ్బతింటుంది. నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు ఓ గ్రామప్రజలు పూడిపోయిన చెరువుకు పూడిక తీసి, గ్రామాన్ని సశ్యశ్యామలంగా చేసుకున్నారు. తమ పంటలకు కావాల్సినంత నీటిని పొందగల్గుతున్నారు. ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

తెలుగు రాష్ట్రాలకి కోనసీమ ఎలాగో... తమిళనాడుకి తంజావూరు అలాగ. కావేరి నది పరివాహక ప్రాంతమది. అంత పచ్చటి ప్రాంతం 2018 నాటి గజ తుపానుకి చిన్నాభిన్నమైంది. ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతంలో... దాదాపు కోటి కొబ్బరి చెట్లు నేలకూలాయి. వాటిని నమ్ముకున్న వేల కుటుంబాలు వీధినపడ్డాయి. ఆ వార్తలు దేశవిదేశాల్లో ఉంటున్న ఆ ప్రాంత యువకులు కొందర్ని కదిలించేశాయి. ఉండబట్టలేక స్వస్థలానికి వచ్చేశారు. తలాకొంత వేసుకుని కట్టుబట్టలతో మిగిలిన తమ బంధుమిత్రులకి సాయం చేయడం మొదలుపెట్టారు. వచ్చిన వారం తర్వాత అక్కడున్న రైతులతో సమావేశం ఏర్పాటుచేశారు “మీరు మళ్ళీ కాడి పట్టడానికి కావాల్సిన సాయం మేం ఇచ్చేస్తాం. సమస్యలేవైనా ఉంటే చెప్పండి... తీరుస్తాం” అని అడిగారట. బాబూ మా కొబ్బరి చెట్లన్నీ కూలిపోయాయి. కొత్త మొక్కలు నాటి దిగుబడి చేతికి రావాలంటే నాలుగైదేళ్లయినా పడుతుంది. అప్పటిదాకా మా కుటుంబాలేం చేయాలి? పొట్టచేతపట్టుకుని వలసవెళ్లడం ఒక్కటే మాకున్న దారి... అని చెప్పారట రైతులు. మరి వరి పంట వేయొచ్చుగా... ఐదారు నెలల్లో దిగుబడి చేతికొస్తుంది? అన్నారట యువకులు. “వరి వేయడానికి మనకి నీళ్లెక్కడివి బాబూ? పేరుకి మనది కావేరి డెల్టా ప్రాంతమైనా... మనం నదికి కడగొట్టున ఉన్నాం. ఎగువ ప్రాంతాలు పూర్తిగా వాడుకున్నాకే మనకి నీళ్లు వదులుతారు. ఆ నీళ్లు సరిపోవనే కొబ్బరి సాగుకి దిగాం...? అని వివరించారు రైతులు. మరి పెద్ద చెరువుందిగా? ఆరా తీశారు ఆ యువకులు. ఉండి ఏం లాభం...? అది ఎండిపోయి ముప్పై ఏళ్ళు అవుతోంది... పూర్తిగా పూడుకుపోయింది. ఆ పూడికేదో మేం తీస్తాం... అని ఆ యువకులు చెబితే “రెండు దశాబ్దాలుగా ప్రభుత్వమూ చేయలేని పని అది అని వాపోయారట రైతులు. మేం చేసి చూపిస్తాం అన్నారా కుర్రాళ్లు! ఆ చెరువు పేరు పేరాపూరణి. దాని పక్కనున్న టౌనుకీ అదే పేరు. 564 ఎకరాల మేర విస్తరించిన చెరువు చెత్తకుప్పలతో నిండిపోయి ఉండేది. దాన్ని బాగుచేయడానికి నడుంబిగించారు. ఆ యువకులు. వాళ్ల పట్టుదల చూసి ఈ ఒక్కసారికే అంటూ అనుమతిచ్చింది ప్రభుత్వం. చెరువు బాగుచేయడంలో ప్రజల భాగస్వామ్యమూ ఉండితీరాలని





అందర్నీ పదో పరకో ఇవ్వమన్నారు. వాళ్ల పిలుపుకి డిబ్బీల్లో చిల్లర దాచుకున్న చిన్నారుల నుంచీ బొడ్డున దోపుకునే సంచిలో పెన్షన్ డబ్బు పెట్టుకునే ముసలమ్మల దాకా విరాళాలు ఇచ్చారు! కేవలం మూడునెలల్లో పూర్తిగా పూడికతీసి చూపించారు. తీసిన ఇసుకని చెరువు మధ్యలోనే చిన్నదీవిలా ఏర్పాటుచేశారు. ఆ దీవిలో వేప, కానుగ వంటి వందలాది దేశీ చెట్లని నాటారు. వీళ్ల కృషితో 2019 నాటి వర్షాలకి అనూహ్యంగా రెండు టీఎంసీల దాకా నీళ్లొచ్చాయి ఆ చెరువులో నాలుగొందల ఎకరాలకి నీళ్లందాయి. పేరాపూరణి టౌను చుట్టూ ఉన్న గ్రామాలు తొలిసారి వరి పంటతో కళకళలాడాయి. ప్రభుత్వం రెండుకోట్ల రూపాయలదాకా అంచనా వ్యయం చూపిన ఈ పనిని... కేవలం 22 లక్షలతో చేసి చూపించారు ఈ యువకులు. వీళ్ల నిజాయతీ, దీక్షాదక్షతల్ని చూసి చుట్టుపక్కల ప్రాంతాలవాళ్లు “మా చెరువునీ బాగు చేయండి... అని అడగసాగారు. వాళ్ల అభ్యర్థనలూ, అవసరాలూ చూసి అప్పటిదాకా విదేశాల్లో ఐటీ ఇంజినీర్లుగా ఉన్న నవీన్ ఆనంద్, కార్తికేయ, నిమల్ రాఘవన్లు రాజీనామా చేసి యువరైతులుగా మారారు. వాళ్లకి మరో ముగ్గురు తోడై చెరువుల బాగుకోసమని కడైమడై ఏరియా ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ అసోసియేషన్(క్రైఫా) అనే స్వచ్ఛంద సంస్థని స్థాపించారు! రాష్ట్రప్రభుత్వమూ వీళ్లకి ప్రత్యేక అనుమతులిచ్చింది. అలా మూడేళ్లలో ఏడు జిల్లాల పరిధిలోని 256 చెరువుల్ని ఉచితంగా బాగు చేసి ఇచ్చారు!

ఈ విజయమే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పుగళేంది దృష్టికి వెళ్లి ఆయన తీర్పులోనూ ప్రతిఫలించింది. ఇటీవలే తమిళనాడు ప్రభుత్వం వీళ్లకి గ్రీన్ ఛాంపియన్స్ అవార్డును అందించింది. ●



# మీ ఆరోగ్యం కోసం..

**ప్రస్తుత రోజుల్లో ఎక్కువ మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో ఒకటి అధిక కొలెస్ట్రాల్. సాధారణంగా చాలా మంది ఆయిల్ ఫుడ్స్, మాంసాహారం, ఫ్యాట్ ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకుంటే కొలెస్ట్రాల్ పెరుగుతుందనే భావిస్తారు. కానీ, కొందరిలో నాన్ వెజ్ తినకపోయినా కొలెస్ట్రాల్ లెవల్స్ పెరుగుతుంటాయి. అయితే, శాఖాహారుల్లోనూ హై కొలెస్ట్రాల్ ప్రాబ్లమ్ ఎందుకు వస్తుంది? ఆ సమస్య నుంచి బయటపడాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలి? పోషకాహార నిపుణులు సూచిస్తున్న డైట్ ప్లాన్ ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.**

శరీరంలో కొలెస్ట్రాల్ లెవల్స్ పెరగడానికి కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఫుడ్ తీసుకోవడం ఒక్కటే కారణం కాదంటున్నారు ప్రముఖ పోషకాహార నిపుణులు డాక్టర్ జానకీ శ్రీనాథ్. జన్యువులు, శరీరతత్త్వం, జీవనశైలి వంటివి ఎక్కువగానే ప్రభావితం చేస్తాయని చెబుతున్నారు. అలాంటి టైమ్‌లో వాటిని సమతుల్యం చేసుకుంటూ ఆహార నియంత్రణ పాటిస్తే కొలెస్ట్రాల్ తగ్గించుకోవడం సాధ్యమే అంటున్నారు. అందుకోసం డైలీ డైట్‌లో కొన్ని మార్పులు చేసుకోవడంతో పాటు జీవనశైలిలో పలు మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు డాక్టర్ జానకీ శ్రీనాథ్.

**వీటిని పరిమితికి మించకుండా చూసుకోవాలి:** మనం రోజు తినే ఆహారంలో కార్బోహైడ్రేట్స్, ప్రొటీన్స్, కొవ్వు పదార్థాలు తగిన మొత్తంలో ఉండాల్సిందే. ఇవన్నీ శక్తి జనకాలు. కానీ, వీటిని రోజువారీ శరీర అవసరాలకు మించి.. ఏ రూపంలో తీసుకున్నా కొలెస్ట్రాల్ పెరుగుతుందని గుర్తుంచుకోవాలి. నూనెలు ఎక్కువగా ఉండే డీప్‌ఫ్రైలు, చిరుతిళ్లు, పనీర్, గుడ్లు, పిండిపదార్థాలు,



చికెన్, పచ్చళ్లు, త్వరగా జీర్ణమయ్యే ప్రాసెస్డ్ ఫుడ్, స్వీట్లు, పళ్ల రసాలు వంటివన్నీ ఇందులోకి వస్తాయి. కాబట్టి, కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవాలంటే మీ ఆహారంలో వీటిని పరిమితికి మించకుండా చూసుకోవడం చాలా అవసరమంటున్నారు.

కొలెస్ట్రాల్ తగ్గడానికి మందులు వాడుతున్నారా? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?

అన్నింటికంటే ముందుగా.. మీ బాడీ వెయిట్, ఎత్తు ఎంత, మనం చేసే పనులకు ఎంత శక్తి అవసరం, అందుకు ఏయే పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి? వంటివన్నీ పరిగణనలోకి తీసుకుని నిపుణులు సూచించే బ్యాలెన్స్‌డ్ డైట్‌ని ఫాలో అవ్వాలని సూచిస్తున్నారు డాక్టర్ జానకీ. అందులో ముఖ్యంగా ఇప్పుడు చెప్పబోయే ఆహారాలను మీ రోజువారి ఆహారంలో తప్పక ఉండేలా చూసుకోవాలి.

ఇవి తప్పక తీసుకోవాలి! : కొలెస్ట్రాల్ తగ్గాలంటే మీ డైలీ డైట్‌లో పీచు ఎక్కువగా, ఆయిల్ తక్కువగా ఉండే పదార్థాలు, నెమ్మదిగా జీర్ణమయ్యే ఓట్స్ బార్లీ, మొక్కజొన్న, చిరుధాన్యాలు చేర్చుకోవాలి. అలాగే కూరగాయలకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వాలి. డ్రైఫ్రూట్స్‌కి బదులు చియా, అవిసె గింజలు వంటి వాటిని తీసుకోవాలి. ఆహారపుటలవాట్లలో ఈ మార్పులు చేసుకోవడంతో పాటు తగినంత శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలి. అలాగే, ఎత్తుకు తగ్గ బరువున్నారో లేదో చెక్ చేసుకుని అందులో కనీసం పదిశాతమైనా తగ్గేలా ఏరోబిక్స్, డ్యాన్స్ వంటివి ప్రాక్టీస్ చేయడం ద్వారా కొలెస్ట్రాల్‌ని తగ్గించుకోవచ్చంటున్నారు వైద్యులు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. కానీ, వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

శీతాకాలం వచ్చిందంటే చాలు.. అనేక అనారోగ్య సమస్యలు మనల్ని చుట్టుముడతాయి. జలుబు, దగ్గు నుంచి ఆస్థమా వరకు అనేక సమస్యలకు ఇబ్బందులు పెడతాయి. చర్మం ఎక్కువగా పొడిబారడం, పగుళ్లు ఏర్పడడం, విటమిన్ లోపాలు ఏర్పడతాయి. ఇంకా జీర్ణవ్యవస్థ పనితీరు మందగించడమే కాకుండా.. ఊపిరితిత్తుల సమస్యలు వస్తుంటాయి. ఇలాంటి శీతాకాలాన్ని జబ్బులకు దూరంగా గడపాలని అనుకుంటారు. మరి అలా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏంటో ప్రముఖ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రమోద్ కుమార్ వివరిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. "శీతాకాలంలో ప్రధానంగా ముక్కు దిబ్బడం, ఆయాసం సమస్య ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి వారు ముక్కులో నాజిల్ డ్రాప్స్ వేసుకోవాలి. ఆయాసం, దమ్ము వచ్చేవారు ఇన్ హెల్లర్స్ వాడాలి. గోరువెచ్చటి నీటిని తాగడం వల్ల గొంతులో ఉన్న ఇన్‌ఫెక్షన్లను దూరం చేసుకోవచ్చు. ఇంకా ఉప్పు కలిపిన గోరు వెచ్చటి నీటిని పుకిలించాలి. ఇలా చేస్తే గొంతులో ఉన్న ఇన్‌ఫెక్షన్లు బయటకు పోతాయి.

అందం, ఆహారం విషయంలో సరైన నియమాలు పాటించడం వల్ల శీతాకాలాన్ని మనకు అనుకూలంగా మార్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ సమయంలో చర్మ రక్షణకు అన్ని రకాల చర్మాల వారు మాయిశ్చరైజర్ క్రీములు వాడాలని సూచిస్తున్నారు. మార్కెట్లో దొరికే నూనెలను రాత్రి పూట పట్టించి ఉదయాన్నే స్నానం చేయడం వల్ల మంచి ప్రయోజనాలు ఉంటాయని అంటున్నారు. ఈ సమయంలో పెదాలు కూడా పగిలే అవకాశం ఉన్నందున..లిప్‌బామ్‌లు రాసుకోవాలని పేర్కొన్నారు.

మాలాకుమార్

# నీ జతగా నేనుంటాను..

పరంధామయ్య ఓ సాధారణ రైతు. భార్య పార్వతమ్మ, కొడుకు రాఘవ, కోడలు సుమిత్ర, మనవరాలు గౌరి, కూతురు సీత, అల్లుడు రామారావు, వారి కొడుకు శంకర్, పరంధామయ్య కుటుంబ సభ్యులు. అన్న కూతురు పుట్టినప్పుడు తన కోడలుగా చేసుకుంటానని ముచ్చటపడి కొడుకు శంకర్ పేరు తగినట్లుగా గౌరి అని పేరు పెట్టి మురిసిపోయింది సీత.

కాలక్రమేణ రామారావు స్నేహితునితో కలిసి వ్యాపారం చేయాలని పట్నం వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. సీత కోరిక మీద రాఘవ బావగారి వ్యాపారం కోసమని కొంత డబ్బు సహాయం చేసాడు.

సీత కూడా శంకర్‌ను తీసుకొని పట్నం వెళ్లింది. శంకర్‌ను మంచి స్కూల్లో చేర్పించాడు రామారావు.

శంకర్‌కు సెలవులు ఇచ్చినప్పుడు సీత పుట్టింటికి వస్తుంటూంది. ముద్దుగా అందంగా ఉన్న గౌరిని రకరకాలుగా ముస్తాబు చేసి నా కోడలు అని ముచ్చటపడిపోయేది సీత.

శంకర్ కూడా గౌరి అంటే ప్రేమగా ఉంటాడు. శంకర్ ఇంటర్‌కు వచ్చేసరికి కోచింగ్ క్లాస్‌లనీ, చదువుకోవాలనీ ఊరికి రావడం తగ్గించేసాడు. అప్పుడప్పుడు సీత మాత్రం వచ్చిపోతుండేది.

ఓరోజు రాఘవ పొలంలో పాము కాటు వల్ల మరణించాడు. సుమిత్ర అతని ఎడబాటును తట్టుకోలేక దిగులుతో చనిపోయింది. గౌరిని తాతయ్య, బామ్మలే చూసుకుంటారు. బామ్మా, తాతయ్యలే లోకంగా, ఆడుతూ పాడుతూ ముద్దబంతి పూవులా అవుతుంది గౌరి.

శంకర్ మంచి మార్కులతో పాసై, ఐ.ఐ.టి. మద్రాస్‌లో చదివి విదేశాలకు వెళ్లిపోయాడు. శంకర్ విదేశాలకు వెళ్లేముందు పరంధామయ్య సీతను గౌరీ–శంకర్‌ల వివాహం గురించి అడిగాడు.

గౌరి చదువులేని పల్లెటూరి పిల్ల అని రామారావు పెళ్లికి ఒప్పుకోడు. విదేశాల్లో చదువు పూర్తి చేసుకున్న శంకర్ తండ్రి ఇష్టప్రకారం వ్యాపారంలో భాగస్వామి కూతురు శశిని పెళ్లి చేసుకుంటాడు.

చిన్నప్పటి నుండి బావను భర్తగా భావించిన గౌరి అది నమ్మలేక స్తబ్దుగా అవుతుంది.

గౌరిని మామూలుగా చేయాలని, స్నేహితుని పెళ్లిలో గౌరిని చూసి ఇష్టపడిన ప్రకాష్‌తో వివాహం జరిపిస్తాడు పరంధామయ్య. కానీ గౌరి ప్రకాష్‌ను భర్తగా అంగీకరించలేపోతుంది. ఊహకు, వాస్తవానికి మధ్య ఊగిసలాడుతూ గౌరి మనసు గజిబిజిగా ఉంటుంది. ప్రకాష్ మొదటిరాత్రి ఆమె పరిస్థితి తెలుసుకొని, సహృదయంతో అర్థం చేసుకుని గౌరిని మామూలుగా చేయగలను అన్న నమ్మకంతో తనతో అమెరికాకు తీసుకొని వెళ్తాడు.

లాంజ్‌లో కొత్త పెళ్లికూతురు గౌరి తల కాస్త పక్కకు వంచి, అరమోడ్పు కన్నులతో అలసటగా కనిపిస్తోంది. ప్రకాష్ తదేకంగా గౌరిని చూస్తున్నాడు. కుందనపు బొమ్మలాంటి ఈ గౌరిలో స్తబ్దత పోయి మళ్లీ వసంతం వస్తుందా? శూన్యంలోకి చూస్తున్నట్లున్న ఆ చూపుల్లో ఎప్పటికైనా చురుకుదనం కనబడుతుందా? తను మనసు పడిన ఈ కన్నెపిల్ల మనసు ఎప్పటికైనా తనది అవుతుందా? ఆలోచనలో తనకు, గౌరితో వివాహం కావటం, మొదటి రాత్రి గౌరి ప్రవర్తన, తాతయ్య పరంధామయ్య చెప్పిన గౌరి కథ అంతా గుర్తు తెచ్చుకున్న ప్రకాష్ విమానంలోకి ప్రయాణంలోకి రమ్మంటున్న ఎనౌన్స్‌మెంట్ విని ఈ లోకంలోకి వచ్చాడు.



మంచులో తడిసిన మల్లెచెండులా ఉన్న గౌరిని అపురూపంగా లేపి, తన అడుగులో అడుగు వేయిస్తూ ముందుకు నడిపించాడు. ప్రకాష్ ప్రయత్నంలో అది తొలి విజయం.

వాషింగ్టన్ వచ్చి వారం అవుతోంది. మొదటిరోజు బెరుకుగా బిత్తర చూపులు చూసిన గౌరి, కొద్దికొద్దిగా అక్కడి వాతావరణానికి అలవాటు పడుతోంది. మాట్లాడకుండా నిశ్శబ్దంగా చిన్న చిన్న పనులు చేస్తూ కాఫీ కలపటం, స్టవ్ వెలిగించటం నేర్చుకుంది.

మౌనంగా కిటికీలో నుంచి బయట పచ్చని చెట్ల కొమ్మల మీద దూకుతూ కనిపించే పెద్ద పెద్ద ఉడతలను ఆసక్తిగా చూస్తూ ఉంటుంది.

**"నువ్వు గౌరి కదూ!" అన్నాడు రావ్.**

**"ఓ.. రావ్! గౌరి నీకు తెలుసా?" విస్మయంగా అడిగాడు వాసు.**

**"తెలుసు. గౌరి మా మామయ్య కూతురు" అని వాసుకు జవాబిచ్చి, బాగున్నావా గౌరీ?" అడిగాడు శంకర్రావు.**

సెలవు పూర్తి అయినందువల్ల ఆ రోజు ఆఫీసుకు వెళ్లాడు ప్రకాష్. కాఫీ షాప్‌లో కాఫీ కప్స్ తీసుకొని రావ్, వాసు, ప్రకాష్ కూర్చున్నారు.

"పార్టీ ఎప్పుడు?" సరదాగా అడిగాడు వాసు.

"పార్టీ మాట సరే. కనీసం మీ ఆవిడ ఫొటో అయినా చూపిస్తావా?" అడిగాడు రావ్.

సెల్ ఓపెన్ చేసి పెళ్లిఫొటో చూపించాడు ప్రకాష్.

"వావ్! బ్యూటిఫుల్" అన్నాడు వాసు.

జవాబివ్వలేదు ప్రకాష్.

రావ్ ఆ ఫొటోను తదేకంగా చూస్తూ ఉండిపోయాడు.

కాఫీ ముగించి లేస్తూ "ఈ వీకెండ్ మీరిద్దరూ మా ఇంటికి డిన్నర్‌కు వచ్చేయండి. పార్టీ సంగతి తరువాత" ఆహ్వానించాడు వాసు.

ఆ వీకెండ్ గౌరీని తీసుకొని వాసు ఇంటికి వచ్చాడు ప్రకాష్.

గౌరిని వాసుకు, వాసు భార్య చంద్రికకు పరిచయం చేసాడు ప్రకాష్.

అప్పుడే రావ్, అతని భార్య శశి వచ్చారు. రావ్‌ను చూస్తూనే గౌరి ఉలిక్కిపడింది. ఏవో జ్ఞాపకాలు తలలో తిరుగుతున్నాయి.

గౌరిని అలాగే చూస్తూ ఉండిపోయాడు రావ్.

"నువ్వు గౌరి కదూ!" అన్నాడు రావ్.

"ఓ.. రావ్! గౌరి నీకు తెలుసా?" విస్మయంగా అడిగాడు వాసు.

"తెలుసు. గౌరి మా మామయ్య కూతురు" అని వాసుకు జవాబిచ్చి, బాగున్నావా గౌరీ?" అడిగాడు శంకర్రావు.

బాగున్నానన్నట్లు తలూపి ప్రకాష్ వైపు బెరుకుగా చూసింది గౌరి.

ప్రకాష్ ఇద్దరి వైపు ఓ క్షణం చూసి "అయితే గౌరికి ఇక కొత్త ఉండదు. నీకు వీలున్నప్పుడల్లా ఇంటికి వస్తూ ఉండు" అన్నాడు ప్రకాష్ నవ్వుతూ.

శశి, చంద్రిక గౌరిని పక్కన కూర్చోబెట్టుకొని, ఏవో మాట్లాడుతున్నా గౌరి అన్యమనస్కంగా జవాబిచ్చింది.

మరునాడు మధ్యాహ్నం గౌరి, కిటికీ దగ్గర కూర్చుని, బయట చెట్ల మీద గంతులు వేస్తూ పరిగెడుతున్న ఉడతలను చూస్తూ, ఆలోచనలో ఉండగా సెల్ రింగ్ అయ్యింది. ముందు పట్టించుకోలేదు కానీ అది ఆగకుండా మోగుతుంటే తీసి "హలో" అంది చిన్నగా.

"గౌరీ! నేను శంకర్‌ను".

ఏం మాట్లాడాలో తెలియలేదు గౌరికి. నిశ్శబ్దంగా ఉండిపోయింది.

ఒక్క క్షణం అలాగే ఉండి, చిన్నగా నిట్టూరుస్తూ సెల్ ఆఫ్ చేసాడు శంకర్.

ఆ వారంలో రెండు సార్లు ఫోన్ చేసాడు శంకర్. గౌరి మౌనంతో ఏమీ మాట్లాడలేకపోయాడు.

గౌరికి ఏమీ అర్థం కావటం లేదు. ప్రకాష్‌తో చెబుదామనుకుంటుంది కానీ చెప్పలేకపోతోంది.

ప్రకాష్ కూడా గౌరిని గమనిస్తున్నాడు. కానీ ఏమీ మాట్లాడటం లేదు.

"ఈ శనివారం రావ్‌వాళ్ల మనల్ని డిన్నర్‌కు పిలిచారు" గౌరికి చెప్పాడు ప్రకాష్.

"వెళ్లాలా?" చిన్నగా అడిగింది.

"అవును. వెళితే బాగుంటుంది. మేం ముగ్గురమూ ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ మంచి స్నేహితులం. మనం కొత్త దంపతులమని భోజనానికి పిలుస్తున్నారు. అయినా మీ బావవాళ్ల ఇంటికే కదా వెళ్లేది" అని జవాబిచ్చాడు.

గౌరీ మాట్లాడలేకపోయింది.

భోజనాలయ్యాక అందరూ తీరికగా కూర్చున్నారు. ఉన్నట్లుండి శంకర్రావ్, ప్రకాష్ వైపు చూస్తూ "ప్రకాష్! నువ్వు గౌరికి విడుకులు ఇస్తే- నేను శశికి విడాకులు ఇచ్చి గౌరిని పెళ్లి చేసుకుందామని అనుకుంటున్నాను. ఎలాగు గౌరి నన్ను మర్చిపోయి నీతో ఉండలేకపోతోంది. కుమిలిపోతోంది కదా. మా నాన్న మాట తీసేయలేక నేను శశిని పెళ్లి చేసుకున్నాను. కానీ గౌరిని, గౌరితో చిన్నతనంలో ఆడిన పెళ్లి ఆటలనూ మర్చిపోలేకపోతున్నాను. గౌరిని పెళ్లి చేసుకుంటే అమ్మమ్మా, తాతయ్యా, అమ్మా, చనిపోయిన మా మామయ్యా, అత్తయ్యా అందరూ సంతోషిస్తారు. మనందరమూ హాయిగా ఉండొచ్చు, ఏమంటావు?" అన్నాడు.

శంకర్ మాటలకు అందరూ నిశ్చేష్టులయ్యారు. కొన్ని క్షణాలు నిశ్శబ్దం తాండవించింది.

ఆ ఆశ్చర్యం నుంచి తేరుకొని "నాకేమీ అభ్యంతరం లేదు. విడాకులిచ్చేస్తాను. గౌరి ఆనందమే నాకు కావలసింది. గౌరికి మంచి చేస్తానని వాళ్ల తాతయ్యకు మాట ఇచ్చాను. సరేనా గౌరీ?" అని గౌరి వైపు చూస్తూ అన్నాడు ప్రకాష్.

చిగురుటాకులా వణికిపోయింది గౌరి. కూర్చున్న చోటు నుంచి లేచి ప్రకాష్ దగ్గరికి వచ్చి చేయి పట్టుకొని "ఏమండీ?" అంటూ బోరుమంది.

"ఎందుకు గౌరీ బాధపడుతున్నావు? మీ బావతో పెళ్లి నీకు ఇష్టమే కదా?" గౌరి తల నిమురుతూ మృదువుగా అడిగాడు ప్రకాష్.

"వద్దు.. వద్దు.. మీరు నన్ను వదిలేయవద్దు. మీరు చెప్పినట్లుగా వింటాను" నిలువెల్లా కంపించిపోతూ అంది గౌరి.

అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామానికి ఏం చేయాలో ఎవరికీ పాలుపోవటం లేదు.

"రావుగారూ! ఇదేమిటి? మీరిట్లా మాట్లాడవచ్చా? వాసూ, నువ్వేమీ మాట్లాడవేమిటి? శశీ, నువ్వూ ఏమనవేమిటి?" గాభరా అంది చంనరదిక శశి వైపు చూస్తూ.

"ఇది వాళ్లిద్దరి సమస్య. నేనేమంటాను?" అన్నాడు వాసు.

శశి ఏమీ మాట్లాడకుండా తల వంచుకుంది.

"ఎందుకు గౌరీ ఏడుస్తున్నావు? ప్రకాష్‌ను ఎందుకు వదలనంటున్నావు? నీకు ఇష్టంలేని పెళ్లి తెంచేసుకొని, నీకిష్టమైనవాడిని నా దగ్గరకు రా. నేను పెళ్లి చేసుకుంటాను. జరిగిందేదో జరిగిపోయింది. ఇప్పుడు ఇద్దరమూ సుఖపడవచ్చు.

పెద్దవాళ్లను సంతోషపెట్టవచ్చు" అనునయంగా అన్నాడు శంకర్.

ఏమీ మాట్లాడేందుకు నోరు పెగలక శంకర్ వైపు చూస్తూ దండం పెట్టి ప్రకాష్‌ను కరుచుకుపోయింది. ప్రకాష్ వైపు బేలగా చూసింది.



లేడికూనలా వణికిపోతున్న గౌరిని దగ్గరగా పొదువుకొని "గౌరీ, భయపడకు. నీకు ఇష్టం లేకుండా ఏమీ జరగదు. నీకిష్టమైతేనే శంకర్‌ను పెళ్లి చేసుకుందువుగాని. లేకపోతే నిన్నెవరూ నా నుంచి వేరు చేయలేరు" అన్నాడు ప్రకాష్.

గౌరి ఆశ్చర్యంగా తలెత్తి చూసింది.

"ఏమిటిదంతా?" విస్మయంగా అడిగింది, చంద్రిక.

"గౌరి నా చిన్ననాటి మరదలు. నాతో ఆడిపాడిన బాల్య స్నేహితురాలు. నన్ను ఎత్తుకొని తిప్పిన మామయ్య కూతురు. ప్రకాష్ పెళ్లి ఫొటో చూపించినప్పుడే గౌరిని గుర్తు పట్టాను. ప్రకాష్ ద్వారా గౌరి స్తబ్దత, బాధ గురించి తెలుసుకున్నాను. తెలిసీ తెలియని వయసులో అమ్మ కోరికతో ఏదో అనుకున్నాం. నేను పట్నం వెళ్లి చదువుకుని, అక్కడి వాతావరణంలో పడి గౌరిని మర్చిపోయాను. చిన్ననాటి జ్ఞాపకాలు ఎక్కువగా గుర్తు లేవు. ఇంటర్ తరువాత నేను మా పల్లెకు కూడా వెళ్లలేదు. ప్రకాష్ ద్వారా గౌరి సంగతి తెలుసుకుని తల్లడిల్లిపోయాను. నా మూలంగా ఇదంతా జరిగింది అని చాలా దిగులు పడుతుంటే శశి ఓ రోజు "ఏమైంది? ఎందుకిట్లా వున్నావని?" అడిగింది.

విషయమంతా శశికి చెప్పాను. తనూ బాధపడింది. మీకు తెలుసుకదా శశి ఫ్యామిలీ కౌన్సెలర్‌గా చేస్తోందని. శశి సలహాతో నేనూ, వాసూ, ప్రకాష్ కలిసి ఈ నాటకం ఆడాం. గౌరీ ఇంకా నన్ను ప్రేమిస్తూనే ఉందా? అని తెలుసుకోవటానికి ప్రకాష్ ఇంట్లో లేని సమయంలో ప్రకాష్ ఎదురుగానే గౌరికి ఫోన్ చేసాను. గౌరి మౌనం, భయం, గౌరి మనసు తెలిపింది. తనను భయాల నుండి బయట పడేయాలనే ఈరోజు ఇలా మాట్లాడాను" వివరించాడు శంకర్.

అదంతా ఆశ్చర్యంగా విన్న చంద్రిక ఆశ్చర్యం నుండి తేరుకొని "ఒకవేళ గౌరి ఒప్పుకొని ఉంటే ఏం చేసేవారు?" శంకర్‌ను ప్రశ్నించింది.

"ఏముంది? ఈ గయ్యాళిని వదిలించుకొని గౌరిని పెళ్లి చేసుకునేవాడిని" శశి వైపు చిలిపిగా చూస్తూ అన్నాడు.

"ఏయ్ నిన్నూ..." అంటూ చేయెత్తింది శశి.

అందరూ నవ్వుతూ గౌరి వైపు చూసారు. గౌరి ప్రకాష్ వైపు ఇంకా అపనమ్మకంగా చూస్తోంది. "ఏయ్ పిల్లా, ఇక నిన్ను వదిలేదు లేదు. నీ జతగా నేనుంటాను. నా జతగా నువ్వుండాలి" సరదాగా గౌరి నెత్తిన మొడుతూ అని, గౌరిని దగ్గరకు తీసుకొని "మేమిక వెళ్తాం" అని వడిపోయి నీరసంగా కనిపిస్తున్న గౌరిని చూస్తూ అన్నాడు ప్రకాష్.

జరుగుతున్నదంతా ఇంకా జీర్ణించుకోలేక తోటకూర కాడలా ప్రకాష్ మీదకు వాలిపోయిన గౌరి భుజం చుట్టూ చేయి వేస్తూ ప్రకాష్ నిలువలేనట్లుగా ప్రకాష్ నడుము చుట్టూ చేయి వేసి గౌరి ఒకరికి ఒకరుగా ఒకే గీతలా సాగిపోతున్న వాళ్లను చూసి- "మన హిందూ సాంప్రదాయంలో అందులోనూ పల్లెలో పెరిగిన ఏ అమ్మాయీ వివాహ బంధం తెంచుకుందామనుకోదు. అందులోనూ బాల్యంలో పెద్దవాళ్ల అనుకున్నది గౌరి మనసులో ఉండిపోయింది. కానీ కొద్దిగా ప్రయత్నం చేస్తే అప్పుడే మామూలు మనిషి అయ్యేది. ఈ షాక్ ట్రీట్‌మెంట్ అవసరం ఉండేది కాదు.

ప్రకాష్ అర్థం చేసుకునే సహృదయుడు కావడం గౌరి అదృష్టం. ఇక అంతా మంచే. శుభం" సంతోషంగా అన్నది శశి.

"గౌరినే కాదు నన్ను అర్థం చేసుకొని సహకరించిన భార్యవు నువ్వు దొరకటం నా అదృష్టం" అన్నాడు శంకర్ భార్య వైపు ప్రేమగా చూస్తూ.

---

**"ఛాలెంజ్" చిత్రంలోని "ఇందువదన కుందరదన మందగమన మధురవచన" అనే పాటకు ప్యారడీ.**

## ప్యారడీ పాట

**పల్లవి:** స్మార్ట్ ఫోను టచ్ ఫోను
అందమైన వొప్పో ఫోను
సామ్‌సంగ్ రెనో వివో అందాలు
చూడరో
అమ్మా నాన్నలను
ఏడిపించి
మరీ మరీ మారాం
చేసి, కొన్నానే
ఐ లవ్ యూ
చరవాణి
నీలో వున్న
ప్రపంచానికే జోహారిక
॥స్మార్ట్॥



**చరణం:** నిద్ర లేస్తూనే నీకు సలాం చేస్తానే
నిదుర కన్నుల మసకల్లో
నువ్వే నా ప్రాణమని గుర్తుంచుకో
గబగబ నొక్కుడుతో
బిరబిరా పరుగులతో ఇన్నాళ్లకు
కాల్ చేస్తే వచ్చిందే గర్ల్‌ఫ్రెండ్
ప్రేమ పవనాలు బలమెంతో పెరిగాయి
హ్యాపీరో నాకు హాయ్ ॥స్మార్ట్॥

**చరణం:** చరవాణిలో ఆట పాటలు సరదాలే సరదాలు
చూస్తూ వుంటే మరిచిన చదువులలో
సెల్ అమ్మ ఒడికి నువు చేరుకో
సెల్‌ఫోను మోజులో
పడిపోయి సెల్‌కు బానిస కాకు
తొలి ఫోను బోర్‌తో బేజారు
కొత్త ఫోను ఆశతో
ఆనందాలు జోరాయే
ఇక లైఫ్ హాయ్ హాయ్ ॥స్మార్ట్॥

**- సంపంగివారి జయచంద్రారెడ్డి,** బాపట్ల


# ప్రాచీనాంధ్ర సాహితీ ప్రస్థానం

**జయసూర్య**



తెలుగు నుడి, నానుడి గ్రంథాన్ని రచించిన డా॥ బి.స. బంగారయ్య, సుమారు 60 సంవత్సరాల క్రితం, సంస్కృత సాహిత్యం నుండి అనువాదం చేసేటప్పుడు ప్రాచీన ఆంధ్ర కవులు కుండపోతగా సంస్కృతాన్ని ఉపయోగించి తెలుగును నిరాదరణకు గురి చేసారని ఆరోపించారు. తెలుగు మాటల వాడుక గిట్టని, పట్టని సంస్కృత పండితులు దేవభాష సంస్కృతం అంటే మరులెక్కువ చూపించడం వలన తెలుగు మరుగున పడిందని, ప్రాచీన కాలంనాటి కవి పండిత వైఖరిని ఆయన విమర్శించారు. ఎందరో కవులు నన్నయ బాటనే అనుసరించారని, కానీ శైవ కవులు మాత్రం దేశికవితకు పట్టం కట్టారని పేర్కొన్నారు. నన్నయ అనుసరించిన మార్గకవితలో, తెనుగు పలుకుబడి లేదని, దేశి కవితలో సంస్కృత వాసన అంతగా లేకపోవటంతో నాడు తెలుగు విలసిల్లిందని పేర్కొన్నారు. నిజమే తెలుగుకు మహా కావ్య గౌరవం కల్గించిన వారిలో తిక్కన అగ్రేసరుడు.

గేయ కవితలు అల్లిన తాళ్లపాక కవులు, క్షేత్రయ్య మొదలైనవారు తెలుగుకు వెలుగు అందించిన మాట వాస్తవమే. తెలుగు గ్రంథాలలో సంస్కృతమే కొలువు చేసిందని, అది సంస్కృత శ్లోకమా? తెలుగు పద్యమా? అనే అనుమానం వచ్చేదాక తెలుగును విడిచి సంస్కృతాన్ని వాడారని అంటూ ఈ విధంగా అవటానికి కారణం చరిత్రగతి అన్నారు. ఆ చరిత్ర పునరావృతం కాకుండా పరాకు లేకుండా ఉండాలని హెచ్చరించారు. బెజవాడ కార్య స్థానంగా డా॥ బి.స.బంగారయ్య తన అభిప్రాయాన్ని సమర్థించుకొంటూ తెలుగు నానుడి కూటమి ద్వారా 'తెలుగు నుడి, నానుడి' వంటి రచనలను వెలువరించారు.



సంస్కృతం తుళ్ళు తగ్గిన తర్వాత తెలుగునాట కొన్నాళ్లయినా ఉర్దూ భాష చెల్లిందని, తర్వాత తెల్లవారి యేలుబడిలో ఆంగ్లభాష రాజభాషగా స్వేచ్ఛా విహారం చేస్తున్న వాస్తవాన్ని గుర్తు చేసారు. ఆంగ్లభాష బోధనా భాషయైన నాటి నుండి, విద్యావంతుల "విశాల దృష్టి" వలన తెలుగు మఱుగయిందని అభిప్రాయం బలంగా ఆ పుస్తకంలో వ్యక్తం చేసారు. ఆనాడు రాజాస్థాన పండితులు, రాజుల మమకారం కారణంగా సంస్కృతం ఎదురులేని యేలుబడి సాగించిందనీ, కానీ ప్రస్తుత ఆంగ్లభాషా ప్రభావం, ముందు ముందు రాష్ట్ర భాషగా హిందీ రాపిడి, మనకు తప్పదని ఆ గ్రంథంలో వివరించారు. పల్లెలలో తెలుగు భాష, నిరక్షరులలో యింకా బతికి ఉందని, మనం మఱవరాదని పొట్ట కోసినా అక్షరం కనబడని తక్కువ కులాల వారిలో రాయలసీమ, తెలంగాణలలో అచ్చమైన తెలుగు బతికి వుందని కానీ వార్తా ప్రసార సాధనాలలో తెలుగుకు చోటు లేదని రచయిత బంగారయ్య ఆవేదన వ్యక్తం చేసారు. నిజమే. తొలినాళ్ల నుండి తెలుగునాట పద్య కవిత్వం రాజ్యం చేసింది. ఆ పద్య కవిత్వంలోని ఇతివృత్తం తెలుగువారిది అంతగా కాదు. ఆర్య సంస్కృతి ప్రధానాంశంగా పురాణేతిహాసాల నుండి, తెలుగు బయట పడటానికి కొంత కాలం పట్టింది. గద్య రచనలు ఆ కాలంలో అంతగా పెరగలేదు. దేశి కవితా మార్గానుయాయులు అయిన శివ కవులు కొంత వెలుగు ప్రసరింపచేసారు. కానీ నౌకాశాస్త్రాదులు, భూగోళ చరిత్రాదులు తెలుగున రాసినవారు లేరు. బౌద్ధ, జైన మతాలకు తెలుగునాట అపరిమిత ఆదరణ, సేవలు లభించాయి.

అయినా తెలుగులో గ్రంథాలు లేవు. తెలుగు మేధావులలో, చరిత్రకారులలో సామాజిక స్పృహ కొరవడింది. ఆంధ్రజాతి, జైనులు రాసిన కావ్యాలను కూడా నిలుపుకోలేకపోయింది. తమిళులు ప్రాచీన కాలంలో తెలుగు ఏ పోకడలో పోయిందో దాదాపు అన్ని దేశ భాషలందు అదే దుస్థితిని చారిత్రక కారణాలు కల్పించాయి. సంస్కృతంలోని మహా కావ్యాలు తెలుగులోకి అనువదించే సంప్రదాయాన్ని నన్నయభట్టు ప్రవేశపెట్టాడు. తిక్కన యుగంలో కూడా అదే విశేషంగా అభివృద్ధి చెందింది.

నన్నయభట్టు తరువాతి వారైన రాజులు, సంస్కృతాన్ని కాకుండా తెలుగు కవిత్వాన్ని (దేశి కవిత) ప్రోత్సహించినట్టు తెలుస్తోంది. పాత సంప్రదాయాన్ని కొంత వెనకకు నెట్టి కావ్య రచన చేయడానికి నన్నయభట్టు సాహసించటానికి గల కారణాలు తెలుసుకోవాలంటే నాటి సామాజిక జీవితం, మత పరిస్థితుల ప్రాబల్యం, ఫ్యూడల్ సమాజ స్థితిగతులు అర్థం చేసుకోవాలి. తెలుగు భాషలో ప్రజా సామాన్యానికి అందరికీ అర్థమయ్యే విధంగా రాయటంలో పురుషార్థ సాధన ఇమిడి వున్నదని తిక్కన భావించాడు. నన్నయ మహాభారత రచన, శైవ, వైష్ణవ ద్వేషాలను ఖండించింది. రాజ్యలోభం, ద్వేషం, కక్ష వంటి ఆవేశాలు మహా సామ్రాజ్యాలను పతనం చేస్తాయనే నీతిని బోధ చేసింది.

అన్నింటికంటే తెలుగుకు జరిగిన అపచారం ప్రాచీన శాసనాలు తెలియచేసిన గ్రంథాలు ఏవీ లభించలేదు.

నెల్లూరు జన్మ స్థలమైన తిక్కన సోమయాజి ఓరుగల్లు వెళ్లి గణపతి దేవుని ఆస్థానంలో మహాభారతం కొనసాగించాడు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను సాంస్కృతికంగా ఐక్యపరిచిన సాహిత్య సృష్టికి తిక్కన మూల పురుషుడు.

తెలుగు భాషలో తొలి చరిత్రకారుడైన ఏకామ్రనాథుడు రచించిన ప్రతాపరుద్ర చరిత్ర తొలి తెలుగు చారిత్రక వచన రచనగా గుర్తింపు పొందింది. ఆధునిక యుగం వరకు చరిత్ర గ్రంథాలు రాయడానికి ఎవరూ తలపెట్టలేదు. కారణం ఏదైనా మన పూర్వీకులకు చారిత్రక స్పృహ లోపించిందనే సత్యం ఒప్పుకోక తప్పదు. దేశ చరిత్ర రాయడమనే ప్రక్రియ తెలియని అజ్ఞాతంలో, నాటికి ప్రచారంలో వున్న కాకతీయులకు చెందిన 225 కథలను సంతరించి, సమన్వయించి కాకతి రాజుల చరిత్రను తెలుగు భాషలో తెలియచెప్పిన ఏకామ్రనాథుని రచనా కాలం కూడా ఊహాపోహలపై ఆధారపడి వుంది. అదే తెలుగులో తొలి చారిత్రక వచన రచన.

స్వయంకృతాపరాధం అంటే అందరికీ తెలిసిందే! మనం చేసే ఓ తప్పు వల్ల మనకే ఆటంకాలు సమస్యలు తలెత్తడం. దాంతో అవస్థపడటం. ఈ విషయాన్ని చెప్పడానికి మాయూరం వేదనాయగం పిళ్లై ఓ కథ చెప్పారు. ఆయన రాసిన ప్రతాప ముదలియార్ చరిత్రం అనే పుస్తకంలో ఈ కథ ఉంది.

# స్వయంకృతాపరాధం

యామిజాల జగదీశ్

ఓ జంట (భర్త, భార్య) ఈ ఇద్దరి మధ్య ఎప్పుడు చూసినా గొడవలే. చీటికీ మాటికీ కీచులాడుకునే వారు, కొట్టుకునేవారు కూడా. అలా ఒకరోజు ఇద్దరూ కీచులాడుకుంటుండగా భర్త ఆమెను చూసి నిన్ను ఏం చేస్తానో చూడు..! అని అన్నాడు ఆవేశంగా. ఏమైనా ప్రతీకారం తీర్చుకుంటారా అని అడిగింది భార్య.

ఊరు చివర పెద్ద చెరువు ఉంది చూసావూ అందులో ...అంటూ అతనేదో చెప్తుండగా ఆమె అతని మాటకు అడ్డు తగిలింది. ఆ చెరువులో నేను పడిపోతాను అన్నాడు భర్త.

అతనలా చెప్పినప్పటికీ ఆమె ఆగలేదు. నువ్వు ఆ చెరువులో పడటాన్ని నేను నా కళ్లారా చూస్తాను.... ఆ పని త్వరగా చెయ్యండి అంటూ అతనిని లాక్కుంటూ పోయింది చెరువు వద్దకు.

అతను బలివ్వడానికి తీసుకుపోయే మేకలా ఆమెతో వెళ్ళాడు. ఇదిగో నువ్వు చెప్పిన చెరువు, అందులో దూకేసేయ్ అంది భార్య. అతను దూకకపోయినా ఆమె వదిలేటట్లు లేదు. అతను దూకడానికి సిద్ధపడ్డాడు. అతను కాస్తంత వెనక్కు వెళ్ళి అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ వచ్చి చెరువులోకి దూకాలి. అందుకని అతను కాస్తంత దూరం వెళ్ళి నిల్చున్నాడు. ఒక్క క్షణం ఆలోచించాడు. అనంతరం అక్కడి నుంచి వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చాడు. చెరువు దగ్గరకు వచ్చేసరికి ఆగాడు. కానీ దూకలేదు. అయితే ఆమె ఊరుకుంటుందా...

ఏమైంది? దూకలేదు... ఆగిపోయారూ, దూకండి అని పెద్దగా అరిచింది ఆమె. అప్పుడతను నెమ్మదిగా ఇలా చెప్పాడు... చెరువులో పడ్డాననుకో నాకు తిరిగి పైకి రావడం ఈత తెలుసు. కనుక నేను చెరువులోంచి ఎలాగోలా పైకి వచ్చేస్తాను. ఆ పై నీ ఇష్టం అన్నాడు భర్త. కనుక నువ్వో పని చేయాలి. అదేంటంటే, నేను దూకడంలో నువ్వు నాకు సాయం చేయాలి....అన్నాడు భర్త.

ఏమిటది? అని అడిగింది భార్య. ఏమిటంటే, నేను మళ్ళీ పైకి రావడానికి వీల్లేని విధంగా నువ్వు నా చేతులు రెండూ కట్టెయ్యాలి. నువ్వలా చేసావంటే నేను పైకెక్కి రాలేను కదా అని అన్నాడు భర్త.



అప్పుడామె ఈ ఆలోచనేదో బాగుంది కదా అనుకుంది. వెంటనే ఆమె ఇంట్లోకి వెళ్ళి ఓ తాడు తీసుకొచ్చి అతని రెండు చేతులూ కట్టేసింది. అతను చెరువు దగ్గర నిల్చున్నాడు.

అతనిని చెరువులోకి నెట్టేయడానికి ఆమె పక్కనే నిల్చుంది.

అయితే అనుకోనిది జరిగింది. అతనిని నెట్టడానికి బదులు ఆమె అదుపు తప్పి చెరువులో పడిపోయింది. ఆమె తనను కాపాడమని చెరువు లోపల నుంచి పెద్దగా కేకలు పెట్టింది.

కానీ ఏం లాభం... భర్త ఏమీ చేయలేని విధంగా అతని చేతులు రెండూ ఆమె తాడుతో కట్టేసిందిగా. చెరువు ముందు నిల్చున్న అతను నింపాదిగా చెప్పాడు...

నేనేం చేయగలను... నిన్ను కాపాడాలనే ఉంది. కానీ నా వల్ల అది సాధ్యం కాదు. ఎందుకంటే నువ్వు నా రెండు చేతులూ కట్టేసావుగా...ఆ కట్టు విప్పలేనుగా అన్నాడు అతను. ఈ సంఘటన ఆమె స్వయంకృతాపరాధమేగా!

............

ఈ కాలంలో భార్యా భర్తల మధ్య గొడవ వస్తే ఎవరూ చనిపోతామని ముందుకు రావడం లేదు. కోర్టుని వెతుక్కుంటూ పోతున్నారు. తీర్పు కోసం నిరీక్షి స్తున్నారు.

ఒక వ్యక్తి అలాగే కోర్టునాశ్రయిం చాడు. భార్యతో కాపురం చేయలేను, విడాకులివ్వండి అని న్యాయస్థానాన్ని అడిగాడు.

విచారణ జరిగింది. ప్రభుత్వ వకీలు అడిగారు... "మీ భార్య కోప్పడుతోందా?" అని అడిగాడు ప్రభుత్వ వకీలు.

"లేదండీ" అన్నాడతను.

"ఆమె హద్దూ అదుపూ లేకుండా ఖర్చు పెట్టేస్తోందా?" అని అడిగారు వకీలు.

"లేదండీ" అన్నాడతను.

"మీ భార్య అబద్ధాలాడుతోందా?" అని అడిగారు వకీలు.

"లేదండీ" అన్నాడతను.

"ఆమె నీకు మర్యాద ఇవ్వడం లేదా?" అని అడిగారు లాయరు.

"అలా ఏమీ లేదండీ" అన్నాడతను.


"అటువంటప్పుడు మీకు ఎందుకు విడాకులు కావాలి?" అని అడిగారు లాయరు.

అతను తల దించుకుని ఆయనను చూసారు. "మీరడిగిన ప్రశ్నలన్నీ నన్ను నేను ప్రశ్నించుకోవాలి. పైగా లోపాలన్నీ నాదగ్గరే ఉన్నాయి. అందుకే విడాకులు ఇమ్మంటున్నాను" అని మెల్లగా చెప్పాడతను.

**వాస్తువార్త**
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్ వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458



# దిక్కులను ఏ విధంగా నిర్ణయిస్తారు?




దిక్కుల గురించి చాలా మందికి తెలుసు. మూలల గురించి న కూడా చాలామందికి తెలుసు. కానీ తూర్పు, పడమర, ఉత్తరం, దక్షిణం; మూలలు ఈశాన్యం, ఆగ్నేయం, నైరుతి, వాయువ్యంల పరిమితులు చాలామందికి తెలియదు. అయితే ఒక స్థలానికి లేదా ఒక క్షేత్రానికి, గృహానికి లేదా గృహంలోని ఒక గదికి ఈ దిక్కులు ఏ విధంగా నిర్దేశింపబడతాయి అన్నది చాలామందికి తెలియదు. తూర్పు దిక్కులో ఉన్న భాగమంతా తూర్పు అయినప్పటికీ, ఇందులో తూర్పు భాగము కొంత మాత్రమే ఉంటుంది. అలాగే మిగతా దిక్కులో ఉన్న భాగంలో కొంత భాగం మాత్రమే ఆ దిక్కులను సూచిస్తాయి. మిగతావి మూలలు అవుతాయి.

ఈ దిక్కుల పరిమితులను, మూలల పరిమితులను తెలుసుకోవటానికి చూపించిన పై పటం చక్కగా పనికి వస్తుంది. ముందు ముందు చెప్పబోయే అనేక వాస్తు విషయాలకు రిఫరెన్స్‌గా ఈ పటం పనికొస్తుంది. అందుకని ఈ కింద చెపుతున్న చేయాలని చదువుతూ, ఈ పటాన్ని ఒకసారి జాగ్రత్తగా గమనించండి. దిక్కుల గురించి మూలల గురించి పూర్తి సమాచారం అవగతం అవుతుంది.

ఒక క్షేత్రం ఏ విధంగా ఎన్ని వంకరలతో ఉన్నప్పటికీ దాన్ని ముందు చతురస్రాకారంగా లేదా దీర్ఘచతురస్రాకారంగా తీర్చిదిద్దుకోవలసి ఉంటుంది. ఈ మార్పుల తర్వాత ఆ స్థలం చతురస్రాకారంగా లేదా దీర్ఘ చతురస్రాకారంగా ఉన్నప్పటికీ, తూర్పు భాగాన్ని తొమ్మిది సమభాగాలుగా విభజించాలి. అలాగే ఉత్తర భాగాన్ని కూడా తొమ్మిది సమ భాగాలుగా వివరించాలి. అలాగే తొమ్మిది సమ భాగాలుగా విభజించుకోవాలి. తూర్పు నుండి పడమరకి ఆ సమ భాగాలు నిర్దేశిస్తూ గీతలు గీసుకోవాలి. అలాగే ఉత్తరంలో ఉన్న సమభాగాలు నిర్దేశిస్తూ ఉత్తరం నుండి దక్షిణానికి కూడా రేఖలు గీసుకోవాలి. అప్పుడు ఏర్పడినటువంటి భాగాలు తూర్పులో 9, దక్షిణంలో 9, పడమరలో 9, ఉత్తరంలో 9 అవుతాయి. ఆ క్షేత్రం మొత్తంలో ఏర్పడినటువంటి సమభాగాలు ఏవైతే ఉన్నాయో వాటన్నిటి మొత్తం సంఖ్య 9 9=81 అవుతాయి. సమ భాగాలలో ఒక్కొక్క భాగానికి ఒక అధిష్టాన దేవత ఉంటారు. క్షేత్రం హద్దుల్లో తొమ్మిదేశి భాగాల్లో ఏర్పడినటువంటి సమ భాగాల్లో కూడా అధిష్టాన దేవతలు ఉంటారు.

ఒక్కొక్క భాగంలో ఉన్న అధిష్టాన దేవతలకు ఒక్కొక్క పేరు ఉంటుంది.

1) తూర్పులో ఉన్న తొమ్మిది భాగాలలో ఈశాన్యం మూల నుండి రెండున్నర భాగాలు + ఉత్తరంలో ఉన్న తొమ్మిది భాగాలలో ఈశాన్యం నుండి రెండున్నర భాగాలు తీసుకొని వీటికి అడ్డంగా ఒక గీత గీసినట్లయితే, ఆ భాగం మాత్రమే ఈశాన్యంగా పరిగణింపబడుతుంది.

2) తూర్పు భాగంలో ఆగ్నేయం వైపు ఉన్న రెండు భాగాలు + దక్షిణంవైపులో ఆగ్నేయ మూల వైపు ఉన్న రెండున్నర భాగాలను కలిపి ఒక గీత గీసినట్లయితే ఆ త్రిభుజాకార స్థలం ఆగ్నేయ భాగం అవుతుంది.

తూర్పులో ఆగ్నేయం వైపు రెండున్నర భాగాలు, ఈశాన్యం వైపు రెండున్నర భాగాలు తీసేస్తే మిగతా నాలుగు భాగాలు మాత్రమే తూర్పు దిక్కుగా పరిగణింపబడుతుంది.

3) ఉత్తరంలో వాయువ్య మూల నుండి రెండున్నర భాగాలు + పశ్చిమంలో వాయువ్య మూల నుండి రెండున్నర భాగాలు కలుపుతూఒక గీత గీసినట్లయితే ఏర్పడే త్రిభుజాకార స్థలం వాయవ్యం అవుతుంది. ఉత్తరంలో వాయువ్యంలోని రెండున్నర భాగాలు, ఈశాన్యంలో రెండున్నర భాగాలు తీసేస్తే నాలుగు భాగాలు మాత్రమే ఉత్తర దిక్కు అవుతుంది.

పడమర దిక్కు కొలతలో వాయువ్యంలో ఉన్న రెండున్నర భాగాలు+నైరుతిలో ఉన్న రెండున్నర భాగాలను తీసివేసినట్లయితే మిగిలిన నాలుగు భాగాలు మాత్రమే పడమర దిక్కు అవుతుంది.
దక్షిణంలో ఆగ్నేయం వైపు ఉన్న రెండున్నర భాగాలు నైరుతిలో ఉన్న రెండున్నర భాగాలు తీసినట్లైతే మిగతా స్థలం దక్షిణం అవుతుంది.

ఈ విధంగా మూలలు కొలత ప్రకారం నిర్దేశింపబడతాయి. ఈ వివరణ ముందు ముందు చెప్పబోయే అనేక వాస్తు విషయాలను అవగతం చేసుకోవటానికి సహాయపడుతుంది.

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం వాస్తువార్తలో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా: సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

**వాస్తువార్త**

పూర్తి పేరు : ........................................
పుట్టిన తేది : ........................................
జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ............
చిరునామా:...........................................

# ఉత్తర ద్వార దర్శనం

ఇలపావులూరి వెంకటేశ్వర్లు

పావన కృష్ణానది మహారాష్ట్రలో ఉద్భవించినది మొదలు ఆంధ్రప్రదేశ్‌లో సాగర సంగమం చేసేవరకు ప్రవాహ మార్గాన్ని సస్యశ్యామలం చేయడంతో పాటు తన తీరాలను ఆధ్యాత్మిక క్షేత్రాలుగా రూపొందించుకొన్నది.

ఈ కారణంగా కృష్ణా తీరాలలో హిందూ ఆలయాలే కాదు బౌద్ధుల, జైనుల నివాస ఆనవాళ్లు కూడా పెక్కుచోట్ల కనిపిస్తాయి. వివిధ దేవీ దేవతలు స్థిరవాసాలైన ఈ ఆలయాలలో ఒకటి విజయవాడ నగరంలో ఇంద్రకీలాద్రిపైన కొలువైన శ్రీ కనకదుర్గమ్మ సన్నిధి.

## పురాణ గాథ

శ్రీ మల్లేశ్వర స్వామి సమేతంగా సమస్త శివ పరివారం కొలువైన ఈ క్షేత్ర పురాణగాథ తొలి యుగం నాటిదిగా తెలుస్తోంది. ద్వాపర యుగంలో పాండవ మధ్యముడైన అర్జునునికి కైలాసనాథుడైన పరమశివునికి యుద్ధం జరిగిన స్థలం ఇదేననీ, ఆ కారణంగా విజయవాటిక అన్న పేరు వచ్చింది అంటారు. కాలక్రమంలో విజయవాడగా మారిందని చెబుతారు. కిరాతక రూపంలో ఉన్న మహేశ్వరునితో పోరు సల్పి అర్జునుడు 'విజయ' నామం పొందిన ప్రదేశం ఇదేనని పురాణాలు పేర్కొంటున్నాయి. పరమేశ్వరుని నుండి పాశుపతాస్త్రం పొందిన అర్జునుడు ఇంద్రకీలాద్రి పర్వత పాదాల వద్ద శ్రీ విజయేశ్వర స్వామిని ప్రతిష్టించారు. ఈ ఆలయంలో ప్రత్యేకంగా శ్రీ బ్రహ్మాస్త్రాదేవి సన్నిధి ఉండటం విశేషం.

తెలుగు రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం అమ్మలగన్న అమ్మ శ్రీ కనకదుర్గమ్మ. ప్రతిరోజూ వేలాదిగా దూర ప్రాంతాల నుండి సైతం భక్తులు వస్తుంటారు. పర్వదినాలలో, నవ రాత్రులలో, భవాని దీక్షల సమయంలో ఆ సంఖ్య లక్షలలో ఉంటుంది. వ్యాపారానికి, విద్యకు ప్రసిద్ధికెక్కిన విజయవాడ నగరంలో మరెన్నో పురాతన ఆలయాలు ఉన్నాయి. అందులో ఇంద్రకీలాద్రి పర్వత పాదాల వద్ద ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఒకటి.

విజయవాడ వన్ టౌన్‌లో ఉన్న ఈ పురాతన ఆలయం పాత శివాలయంగా ప్రసిద్ధి. పర్వత పాదాల వద్ద ఉండటం, పాండవ మధ్యముని పూజలు అందుకోవడంతో గతంలో 'పాద శివాలయం' అని పిలిచేవారట. కాలక్రమంలో పాత శివాలయంగా పిలవబడుతోంది. కొన్ని వందల సంవత్సరాల పురాతన చరిత్ర, పౌరాణిక ప్రాశస్త్యం కలిగిన దేవాలయాన్ని పాత శివాలయం అని పిలవడం సమంజసం. విశేష పౌరాణిక చారిత్రక నేపథ్యం కలిగిన ఆలయం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివార్ల దేవాలయం.



## ఆలయ ప్రత్యేకతలు

పాత శివాలయం సందర్శన పుణ్య తీర్థ క్షేత్రాల సందర్శనతో సమానం అని చెప్పవచ్చు. కారణమేమిటంటే ఎన్నో ఉపాలయాల సమాహారం ఈ క్షేత్రం. ప్రతి ఉపాలయానికీ ఒక ప్రత్యేకత వుండటం విశేషం. శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి క్షేత్రపాలకుడు. శ్రీ గణపతి, శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, శ్రీ షణ్ముఖుడు, శ్రీ ధర్మశాస్త, శ్రీ భూదేవి శ్రీదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరుడు, శ్రీ లక్ష్మీ నరసింహుడు, శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీ చండికేశ్వరుడు, శ్రీ షిర్డీ సాయిబాబా, శ్రీ కేతేశ్వర మహారాజ్ ఆదిగాగల దేవీదేవతలు వివిధ సన్నిధులలో దర్శనమిస్తారు.

చాలా తక్కువగా కనిపించే మరికొన్ని విశేషాలు విజయవాడ పాత శివాలయంలో కనిపిస్తాయి. శివలింగాలలో అతి పవిత్రమైనది. ఇష్టకామ్యాలను నెరవేర్చే బ్రహ్మసూత్రం ఉన్న లింగం అని పెద్దల మాట. బ్రహ్మసూత్రం ఉన్న లింగాలు చాలా అరుదుగా కనిపిస్తాయి. పాత శివాలయంలో ప్రధాన గర్భాలయంలో కొలువైన శ్రీ మల్లేశ్వర స్వామి వారితో సహా శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి, శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి, శ్రీ రామలింగేశ్వర స్వామిగా వివిధ రూపాలలో సర్వేశ్వరుడు దర్శనమిస్తారు. ఈ అయిదు లింగాలు వివిధ బ్రహ్మసూత్రాలు కలిగి ఉండటం విశేషం. అనేక శివలింగాలు నెలకొని ఉన్న ప్రముఖ

ఆలయదర్శనం

దేవాలయాల్లోనూ ఇలాంటి లింగాలు కనిపించవు. శ్రీ మృత్యుంజయేశ్వర లింగానికి భక్తులు స్వహస్తాలతో అభిషేకం చేసుకొనే అవకాశం లభిస్తుంది. ఎవరైనా జాతకరీత్యా కుజదోష ప్రభావం కలిగి ఉంటే నివారణార్థం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలో శ్రీ ధర్మశాస్త సన్నిధి పక్కన అశ్వత్థ వృక్షం ఉంటుంది. అక్కడ నాగ ప్రతిష్టలు కనిపిస్తాయి. శ్రీ చంద్రమౌళీశ్వర స్వామివారి సన్నిధిలో ఒక పక్కన గణపతి, మరో పక్కన అమ్మవారు ఉపస్థితులై ఉంటారు. ఇది కూడా మరెక్కడా కనిపించని విశేషమే! శ్రీ భ్రమరాంబాదేవి విడిగా ప్రత్యేక సన్నిధిలో కొలువై ఉంటారు.



చతుర్భుజాలతో, ఉపస్థిత భంగిమలో ప్రసన్నవదనగా అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకరాచార్యులవారు అమ్మవారి సన్నిధిలో శ్రీచక్రాన్ని స్థాపించారు. అమ్మవారికి ఒక పక్కన శ్రీ మహాలక్ష్మి మరో పక్కన శ్రీ సరస్వతీదేవి కొలువై దర్శనమివ్వడం అరుదుగా కనిపించే విశేషం. ఆలయ ఆగ్నేయ మూలలో ఉన్న శ్రీ కాత్యాయని ఇష్టకామేశ్వరీదేవి సన్నిధి వద్ద నేతి దీపం వెలిగించి, దానిని చేతిలో ఉంచుకొని అమ్మవారి ఆలయానికి ప్రదక్షిణాలు చేస్తే గుణవంతుడు, కోరుకొన్నవాడు భర్తగా లభిస్తారన్నది తరతరాల విశ్వాసం.

శ్రీ రామేశ్వర స్వామి లింగాన్ని రామేశ్వరం నుండి, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి లింగాన్ని వారణాశి నుండి తీసికొనివచ్చి ప్రతిష్ఠించినట్లు తెలుస్తుంది.

తూర్పు ముఖంగా ఉన్న ఆలయానికి స్థూపాకారంలో నిర్మించిన నాలుగు అంతస్థుల రాజగోపురం సుందరంగా కనిపిస్తుంది. ప్రస్తుత ఆలయాన్ని క్రీస్తుశకం తొమ్మిదో శతాబ్దం(808 నుండి 847 సంవత్సరాల మధ్య కాలంలో)లో రాష్ట్రకూట రాజులు నిర్మించినట్లు శాసనాధారాలు తెలుపుతున్నాయి. ఆ తరువాత ఎన్నో రాజవంశాలు, పాలకులు ఆలయాభివృద్ధికి తమ వంతు కృషి చేసినట్లుగా క్షేత్ర గాథ ద్వారా తెలియవస్తోంది.

రాజగోపురం దాటి ప్రాంగణంలోనికి ప్రవేశిస్తే ఎదురుగా బలిపీఠం ధ్వజస్థంభం కనిపిస్తాయి. గతంలో ధ్వజస్థంభం పునః ప్రతిష్ఠ సమయంలో తవ్వకాలు జరపగా శ్రీ కాలభైరవ విగ్రహం లభించింది. శ్రీ కాలభైరవుణ్ణి అక్కడే ప్రతిష్ఠించారు. చిన్న ప్రాంగణంలో కిక్కిరిసినట్లు ఉంటాయి ఉపాలయాలు. అక్కడే అనేకమంది బ్రాహ్మణులు జపాలు చేస్తూ కనిపిస్తారు. భక్తులు తమ జాతకరీత్యా ఏర్పడిన గ్రహదోషానికి ఇక్కడ జపాలు, దానాలు, శాంతులు జరిపించుకుంటుంటారు. సోమవారాలు, విశేష సమయాల్లో భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు.

ప్రదక్షిణా పథంలో వరుసగా ఉపాలయాలు వస్తాయి. ఈ ఆలయానికి ఉన్న మరో విశేషం ఏమిటంటే ఉత్తర ద్వారం కలిగి వుండటం. అంటే ప్రతిరోజూ ఉత్తర ద్వార దర్శనం లభిస్తుంది. ఆ ద్వారం పక్కనే కొద్దిగా లోపలి ఆలయంలో లభించిన శాసనాలు ఉంటాయి.

ఆంధ్రప్రదేశ్‌లో అతి తక్కువగా కనిపించే శ్రీ చండికేశ్వర స్వామి సన్నిధి గోముఖి వద్ద ఉంటుంది. పక్కనే నాగశిల్పాలు, పంచలోహ ఓంకారం, త్రిశూలం ఉంటాయి. ఇవన్నీ వివిధ కాలాలలో నిర్మించడం వలన ఒక వరుసలో ఉన్నా ఒక క్రమపద్ధతి కనపడదు. కిక్కిరిసినట్లుగా ఉంటుంది. అయినా ఇంతమంది దేవీదేవతలు ఒకే ప్రాంగణంలో దర్శించుకొని భాగ్యం ముందు ఇవన్నీ పట్టించుకోవలసిన అవసరం లేదు. అక్కడ లభ్యమయ్యే ప్రశాంతతను, ఆధ్యాత్మిక పరిమళాన్ని ఆస్వాదించడమే మనం చేయవలసింది.

## ఉత్సవాలు

భక్తుల దర్శనార్థం ఉదయం ఆరు గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు; తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల వరకు తెరిచి ఉండే ఆలయంలో నియమంగా అభిషేకాలు, అలంకరణలు, అర్చనలు, ఆరగింపులు జరుగుతాయి.

పౌర్ణమికి, అమావాస్యకు, మాస శివరాత్రికి, త్రయోదశి రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తిక మాస పూజలు, శివరాత్రి, నవరాత్రులు, గణపతి నవరాత్రులు, శ్రీ నృసింహ జయంతి, సుబ్రహ్మణ్య షష్ఠి, శ్రీరామనవమి, శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా విశేష పూజలు చేయించుకోడానికి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఉగాది సందర్భంగా వేలాది మంది స్థానిక భక్తులు వస్తుంటారు.

భవానీ, శ్రీ అయ్యప్ప దీక్షా సమయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రతిరోజూ వేదమంత్రాలతో శోభిల్లే ఆలయంలో మాఘ మాసంలో ఆది దంపతుల కళ్యాణ మహోత్సవాలు, చైత్రం మాసంలో వసంత నవరాత్రులు ఘనంగా చేస్తారు.

నిత్య ఉత్సవ క్షేత్రమైన విజయవాడ పాత(పాద) శివాలయ సందర్శన భక్తులలో ఆధ్యాత్మిక అనుభూతులను నింపుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

**(25వ పేజీ తరువాయి..)**

ఉత్తరమేదో, దక్షిణం ఏదో, తూర్పు ఎంత భాగం, దక్షిణం ఎంత భాగం... ఇలాంటి మీమాంస ఇక ఉండదు. దిక్కుల విషయంలో అంటే– ఈశాన్యం, ఆగ్నేయం, వాయువ్యం, నైరుతి వీటి గురించిన మీమాంస కూడా ఉండదు ఆగ్నేయంలో ఇలా చేస్తే అనేక శుభ ఫలితాలు ఉంటాయి.. అని చెప్పినప్పుడు ఆగ్నేయంలో ఎక్కడ? ఏమిటి?.. అన్న సంశయం కూడా రాదు. ముందు ముందు చెప్పబోయే అనేక రకాల వివరాలకి అంటే వీధి పోట్లు, వెన్నుపోట్లు, పూజా గదులు, సంపులు, ట్యాంకులు, బోర్లు... ఇలా అనేక విషయాల గురించి చెప్తున్నప్పుడు ఫలానా దిక్కు, ఫలానా మూల అని ఉన్నప్పుడు మీరు అర్థం చేసుకోవటం సులభతరం అవుతుంది. పైన చూపించిన పటాన్ని ఒకసారి నిశితంగా పరిశీలించి పెట్టుకోండి, లేదా ఈ పటాన్ని జాగ్రత్త పరుచుకోండి. ముందు ముందు చెప్పబోయే అనేక విషయాలకి చాలా పనికొస్తుంది.

### జోక్

టీచర్: చింటూ, నేను వంద రూపాయలు, సోషల్ టీచర్ వంద రూపాయలు, సైన్స్ టీచర్ వంద రూపాయలు ఇస్తే మొత్తం నీ దగ్గర ఎన్ని రూపాయలు ఉంటాయి?

చింటూ: ముందు ఆ ముగ్గురూ డబ్బులు ఇచ్చిన తరువాత ఆ ప్రశ్న అడగండి టీచర్.

టీచర్: ఆ....

**- వైదా ఈశ్వరరావు,**
విశాఖపట్నం



# నమ్మకం

**పర్వతాల శ్రీనివాసులు**

డాక్టర్ అబ్దుల్ రషీద్ గొప్ప వైద్యుడు. ఇతని సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం వైద్యరంగంలో చేసిన సేవలకు ఇచ్చే అవార్డును ఇచ్చి సన్మానం చేయాలని ఆ అవార్డును ప్రకటించింది.

ఈ అవార్డును ఢిల్లీలో ఒక గొప్ప కార్యక్రమం ఏర్పాటు చేసి ఒక తేదీని ఖరారు చేసి డాక్టర్ అబ్దుల్ రషీదుకు విషయాన్ని తెలిపారు. డాక్టర్ అబ్దుల్ రషీద్ హైదరాబాద్‌లో ప్రముఖ హాస్పిటల్‌లో వైద్యసేవలు అందిస్తుంటాడు.

రషీద్ అవార్డు అందుకునే రోజు రానే వస్తుంది. అవార్డు ప్రదానం చేసే కార్యక్రమం సాయంత్రం 4.30 గంటలకు ఉంటుంది. ఇక డాక్టర్ అబ్దుల్ రషీద్ ఆ రోజు తాను చేయాల్సిన డ్యూటీ చేసుకొని హైదరాబాద్ నుండి ఢిల్లీకి విమానంలో వెళ్తుంటాడు. మార్గమధ్యంలో ఎడతెరపిలేని గాలివానతో విమానం ముందుకు వెళ్లే పరిస్థితి ఉండదు. దాంతో పైలట్ విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సి వస్తుంది. నిమిషాలు గడిచిపోతుంటాయి. విమానం నడపడానికి అనుకూలంగా లేకపోవడంతో ఎటూ తోచని పైలట్, ప్రయాణికులు ఇబ్బంది పడుతుంటారు. కానీ అబ్దుల్ రషీద్ మాత్రం తనకు రావల్సిన అవార్డును సమయానికి వెళ్లి తీసుకోలేకపోతున్నానని మదనపడుతుంటాడు. ఒకవైపు కోపం, మరొక వైపు బాధతో చాలా ఇబ్బందిగా ఫీలవుతుంటాడు.

అంతలో ఒక ఆలోచన వస్తుంది. కారులో వెళ్దామను కుంటాడు. కానీ సమయం సరిపోదేమోనని సందేహం. సమయం గంటల్లోనే ఉంటుంది. ఏదయితే అది అవుతుందనుకొని ఒక కారు మాట్లాడుకొని ప్రయాణం సాగిస్తుండగా కొంత దూరం వెళ్లేసరికి గాలి, వర్షం చాలా బీభత్సం సృష్టిస్తుండటంతో రోడ్డు మీద చెట్లు పడిపోయి ముందుకు వెళ్లే పరిస్థితులు కనిపించవు. చూస్తుండగానే చీకటి పడుతుంది. ఇంతలో అతనికి కొంత దూరంలో చిన్న వెలుతురు కనిపిస్తుంది.

నెమ్మదిగా ఆ కారులోనే డాక్టర్ అబ్దుల్ రషీద్ ఆ వెలుగు కనిపించే చోటుకు వెళ్తాడు. అక్కడ కారును ఆపి తాను, ఆ కారు డ్రైవర్ ఇద్దరూ వెళ్లి చూడగా, అక్కడ ఒక చిన్న ఇల్లు ఉంటుంది. దగ్గరికి వెళ్లి తలుపులు తట్టగానే ఆ ఇంట్లో నుండి ఒకావిడ వచ్చి "మీకు ఏం కావాలని?" వాళ్లిద్దరిని అడుగుతుంది.

"అమ్మా! మేం ప్రయాణం చేస్తుండగా ఈదురుగాలి, వర్షం కురుస్తుండటంతో ఎక్కడికీ వెళ్లే పరిస్థితి కనిపించక ఈ రాత్రికి ఇక్కడ తల దాచుకుందామని వచ్చాం. ఈ రాత్రికి ఇక్కడే పడుకోవడానికి అవకాశమిస్తే తెల్లవారగానే వెళ్లిపోతామని డాక్టర్ అబ్దుల్ రషీద్ అంటాడు.

ఆవిడ సరేనని చెప్పి ఆమె ఇంట్లో వున్న ఆహారాన్ని వారిద్దరికి పెట్టి తిన్నాక రెండు దుప్పట్లు ఇచ్చి పడుకోమని చెబుతుంది. డాక్టర్ అబ్దుల్ రషీద్‌కు తాను ప్రభుత్వం ఇచ్చే సత్కారాన్ని నేరుగా పొందలేక పోయాననే బాధ వేధిస్తుంటుంది.

తెల్లవారగానే ఆవిడ డాక్టర్ అబ్దుల్ రషీద్‌కు, కారుడ్రైవర్‌కు టీ ఇస్తుంది. వాళ్లు టీ తాగి వెళ్లిపోయేముందు డాక్టర్ ఆమెతో "అమ్మా, మీరు ఏమనుకోనంటే ఒక మాట అడుగుతాను" అంటాడు.

"సరే, చెప్పండయ్యా" అంటుంది.

"మేం రాత్రి వచ్చినప్పటి నుండి మీలో మీరు ఏదో మాట్లాడుకుంటున్నారు" అని అడిగాడు డాక్టర్ రషీద్.

"అయ్యా, నాకు ఒక కొడుకు. వాడు పుట్టినప్పటి నుండీ అనారోగ్యంతోనే ఉన్నాడు. ఎన్ని దవాఖానాలు తిరిగినా, ఎన్ని రకాల మందులు వాడినా ఆ జబ్బు తగ్గడం లేదు. ఒకరోజు ఒక సాధువు 'నారాయణ' అనే నామాన్ని ప్రతిరోజూ జపించమని చెప్పాడు. అలా చేస్తే కొంత కాలానికి మార్పు కచ్చితంగా వస్తుందని చెప్పాడు. ఇక అప్పట్నుంచి నిత్యం నారాయణ నామాన్నే జపిస్తున్నాను. నా బాధను చూడలేక కొంతమంది హైదరాబాద్‌లో డాక్టర్ అబ్దుల్ రషీద్ అనే గొప్ప డాక్టర్ ఉన్నారని చెప్పారు. కానీ వెళ్లాలంటే ఆర్థిక స్థోమత లేకనే ఆ డాక్టర్ గారిని సంప్రదించలేకపోతున్నాం. రోజు రోజుకీ నా కుమారుడి ఆరోగ్య పరిస్థితి క్షీణించిపోతోంది. ఇక ఆ భగవంతుడు నారాయణమూర్తే మాకు ఏదయినా దారి చూపిస్తే మా అబ్బాయి జబ్బు నయమై, మా కష్టాలు పోతాయని బాధపడుతూ ఆవిడ చెప్పగానే డాక్టర్ అబ్దుల్ రషీద్‌కు కళ్ల వెంట నీళ్లు కారసాగాయి.

"అమ్మా, మీరు సంప్రదించాలను కుంటున్న డాక్టర్ అబ్దుల్ రషీద్‌ను నేను. మీరు నమ్మిన ఆ నారాయణుడే నన్ను మీ దగ్గరికే రప్పించాడు. మీ అబ్బాయిని నేను కాపాడతానని చెప్పి హాస్పిటల్‌కు రమ్మని చెప్పాడు.

డాక్టర్ మాటలు విన్న ఆవిడకు సంతోషం కలుగుతుంది. ఎన్ని కష్టాలు ఉన్నా, భగవంతుడి నామాన్ని నిత్యం జపిస్తుండటం వల్ల ఇంతటి అదృష్టం కలిగిందనీ, తన నమ్మకమే తన కొడుకు ఆరోగ్యం బాగుపడటానికి ఒక దారి చూపించిందని అంటుంది.

రషీద్ కూడా తాను పొందాల్సిన అవార్డును పొందినదానికంటే ఎక్కువ సంతృప్తి కలిగింది. వెంటనే తనతో పాటే ఆవిడను, ఆవిడ కొడుకుని హాస్పిటల్‌కు తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ చేసి, అతని జబ్బును పూర్తిగా నయం చేస్తాడు.

ఎన్ని అవార్డులొచ్చినా ఆత్మతృప్తి ముందు బలాదూర్ అనుకుంటాడు డాక్టర్ రషీద్. ఆ తల్లి నమ్మకమే దారి లేని తమకు ఒక దారి చూపించి, కాస్త ఆలస్యమయినా తన కొడుకుని కాపాడింది.

# ఖరీదైన ఉన్ని



**ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన ఫ్యాబ్రిక్ గురించి మీకు మీకు తెలుసా? దీన్ని 'గోల్డ్ ఆఫ్ ఆండీస్'గా పిలుస్తుంటారు.**

ఖరీదైన కశ్మీరీ నుంచి కాస్త అందుబాటులో ఉండే కాటన్, సిల్క్, లినెన్ వరకూ రకరకాల ఫ్యాబ్రిక్స్ గురించి వినే ఉంటారు. వాటిల్లో ఒక్కోదానికి ఒక్కో తయారీ విధానం, ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అయితే ప్రపంచంలోకెల్లా అత్యంత ఖరీదైన ఫ్యాబ్రిక్ గురించి తెలుసుకుందాం.

అత్యంత మృదువైన, అరుదైన ఫ్యాబ్రిక్‌గా 'వికూనా' పేరు గాంచింది. దీన్ని 'గోల్డ్ ఆఫ్ ఆండీస్'గా పిలుస్తుంటారు.

ఒకప్పుడు రాజకుటుంబీకులు మాత్రమే ఈ ఫ్యాబ్రిక్‌ని ధరించేవారట. అత్యంత పలుచగా, లేత బంగారు వర్ణంతో మెరిసిపోయే ఈ ఉన్ని ఒక మీటరు ధర దాదాపు నాలుగు లక్షల రూపాయల పైనే ఉంటుందట.

ఈ ఫ్యాబ్రిక్‌లో బేసిక్ మోడల్ జాకెట్ కొనాలన్నా లక్షలు కావాల్సిందే.

"అమ్మో! అంత ఖరీదా?" అంటే నిస్సందేహంగా అవుననే చెప్పాలి.

## ఇంత ఖరీదెందుకు?

'వికూనా' అనేది ఒంటె జాతికి చెందిన ఓ జీవి. కాస్త పొట్టిగా, చలాకీగా ఉండే ఈ జాతి జీవులు దక్షిణ అమెరికాలోని ఆండీస్ పర్వత సానువుల్లో మాత్రమే కనిపిస్తుంటాయి. 3200 నుంచి 4800 మీటర్ల ఎత్తయిన ప్రదేశాల్లో నివసిస్తూ, అత్యంత ప్రతికూల వాతావరణ పరిస్థితులను సైతం తట్టుకుంటాయి. రాత్రిళ్లు ఉష్ణోగ్రతలు మైనస్‌లోకి పడిపోయినా, వీటి చర్మంపైన ఉండే ఉన్ని పొరలు వేడిని పట్టి ఉంచుతాయి. ఈ జీవుల ఉన్ని ప్రత్యేకత లక్షణం కలిగి ఉండటంతో పాటు యేడాదిలో ఒక వికూనా నుంచి కేవలం 500 గ్రాముల ఉన్ని మాత్రమే ఉత్పత్తి అవుతుందట. ఆ లెక్కన ఒక జాకెట్ (కోటు)ను తయారు చేసేందుకు కనీసం 25 జీవులు అవసరమవుతాయన్నమాట.

మూడేళ్లకోసారి మాత్రమే వీటి నుంచి ఉన్నిని సేకరిస్తారట. ఆ తర్వాత ఆ వికూనాకు గుర్తుగా ఒక ట్యాగ్ లాంటిది వేసి మళ్లీ అడవుల్లోకి వదిలేస్తారట. ఆండీస్ పర్వత శ్రేణుల్లోని వాతావరణంలో తప్ప మరెక్కడా ఈ జీవుల జాడ కనిపించదు కనుకనే వాటికి అంత డిమాండ్. వికూనాల నుంచి సేకరించే ఉన్ని కాబట్టి ఆ ఫ్యాబ్రిక్స్‌కు ఆ పేరొచ్చింది. ఇది రెండో ఖరీదైన ఫ్యాబ్రిక్ కశ్మీరీ కంటే రెట్టింపు మృదుత్వాన్ని కలిగి ఉంటుందట.



## తగ్గిపోతున్న..

ఇష్టానుసారం వేటాడటం తదితర కారణాలతో 1960 దశకంలో ఈ వికూనాల సంఖ్య తగ్గడం ప్రారంభమైంది. అంతరించిపోయే జాబితాలోనూ చేరాయి. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తులో వాటి ఉనికే ప్రశ్నార్థకం కానుందని గుర్తెరిగిన అక్కడి ప్రభుత్వాలు, యునెస్కోతో సహకారంతో వికూనాల సంరక్షణకు నడుం బిగించాయి.

కట్టుదిట్టమైన చర్యలతో క్రమంగా వాటి సంఖ్య పెరగసాగింది. ఆ సమయంలోనే వెచ్చదనాన్ని పట్టి ఉంచే ఆ జీవుల ఉన్ని గొప్పతనం ప్రపంచానికి తెలిసింది. వాణిజ్య పరంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80. *sunmagvaartha@gmail.com***



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు.
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795



## మేషం

విదేశాలలో ఉన్న మీ వాళ్లకు స్వదేశంలో గృహం ఏర్పాటు చేస్తారు. వాళ్ల పెట్టుబడులను మీరు మంచి మార్గంలో పెట్టి మీ వాళ్లకి మేలు చేస్తారు. ఒక సందర్భంలో స్నేహితులకి గోప్యంగా ఆర్థిక సహాయం అందిస్తారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కొంత ధనాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తారు.



## వృషభం

ఎదురు చూస్తున్న పుట్టింటి తరపు ప్రయోజనాలు, పంపకాలు చేతికి అందివస్తాయి. ఆధునిక పరికరాలు కొనుగోలు చేస్తారు. సుమంగళి పసుపుతో గౌరీదేవి అమ్మవారి అష్టోత్తరం చదువుతూ అర్చన చేయండి. కుటుంబ సమేతంగా విహార యాత్రలు చేస్తారు. జీవిత భాగస్వామితో మాట పట్టింపులకు పోకుండా ఓపికతో వ్యవహరించండి. శుభ వార్తలు వింటారు.



## మిథునం

నూతన వ్యాపారం గురించి ఆలోచిస్తారు. ఆలోచనలు వెంటనే కార్యరూపం దాల్చడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసారు. కొన్ని విషయాలను గోప్యంగా ఉంచి వ్యవహరిస్తారు. విద్యార్థులకు అనుకూలం. ఓం నమశ్శివాయ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. నూతన విద్యల కోసం చేసే ప్రయత్నాలు బాగుంటాయి. స్కాలర్‌షిప్స్, రుణాలు లభిస్తాయి.



## కర్కాటక

కొత్త పరిచయాలు, స్నేహాలు ఉపకరిస్తాయి. దూర ప్రాంత ప్రయాణాలలో కొత్త విషయాలు తెలుసుకుంటారు. మన భూమి వేరొకరి హస్తగతమైందన్న సమాచారం వింటారు. ప్రత్యక్షంగా మీరు నిర్ధారించుకోకుండా ఏ నిర్ణయానికీ రావద్దు. వృత్తి పట్ల ఎంతో శ్రద్ధ కనబరుస్తారు. శక్తికి మించి శ్రమించి కొన్ని ప్రాజెక్టుల బాధ్యత నిర్వహిస్తారు.



## సింహం

కీళ్లనొప్పులు, నడుమునొప్పి సమస్యలు బాధిస్తాయి. మార్కెటింగ్ రంగంలో వున్నవారికి అనుకూలం. మీ ప్రవర్తన ఎంతో మందిని ఆకట్టుకుంటుంది. వ్యాపారం అభివృద్ధి దిశలో ఉంటుంది. నవగ్రహాల దగ్గర అష్టమూలికా తైలం, నవగ్రహ వత్తులతో దీపారాధన చేయండి. కార్యాలయంలో బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటారు.



## కన్య

తాత్కాలిక వ్యాపారాలు మొదలు పెట్టాలన్న ఆలోచనలు ఫలిస్తాయి. చిన్ననాటి స్నేహితులతో కలిసి విహార యాత్రలు చేస్తారు. కళా సాహిత్యకారులకు అనుకూలం. పూజలలో ఆరావళి కుంకుమ ఉపయోగించండి. నూతన అవకాశాలు అందుకుంటారు. ఒకే సమయంలో రెండు మూడు అవకాశాలు రావటంతో సమయాన్ని సరిగ్గా కేటాయించలేని పరిస్థితులు ఏర్పడతాయి.




## తుల

సంగీతం పట్ల ఆసక్తి చూపిస్తారు. విస్తృత ప్రయత్నం చేసి గురువులను వెతుకుతారు. వాహనాల అమ్మకాలు-కొనుగోలు విషయంలో మెళకువలు పాటించి అధిక లాభాలు అందుకుంటారు. క్యాటరింగ్, పూల వ్యాపారస్తులకు అనుకూలం. మెడలో కాలభైరవ రూపు ధరించండి. ముఖ పరిచయం లేనివారికి ధన సహాయం చేయవద్దు. ఇతరులతో వ్యక్తిగత విషయాలు చర్చించకండి.



## వృశ్చికం

ఎంతగానో శ్రమించి ఒక ప్రాజెక్టుని సకాలంలో క్లైంట్‌కి అందచేస్తారు. మంచి పేరు సంపాదిస్తారు. లీజు, లైసెన్సులు లభిస్తాయి. గవర్నమెంట్ ఉత్తర్వులకు సంబంధించి మీరు తీసుకునే నిర్ణయాలు మేలు కలగజేస్తాయి. నూతన కాంట్రాక్టులు అందుకుంటారు. అన్ని వ్యవహారాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రయోజనాలు దక్కించుకుంటారు. కుటుంబ సమేతంగా విహార యాత్రలు, ఆధ్యాత్మిక యాత్రలు చేస్తారు.



## ధనుస్సు

సంతాన ఆరోగ్యం పట్ల ఆందోళన చెందుతారు. వారి గురించి ఎంతగానో సమయం, ధనం వెచ్చిస్తారు. వారి బాగోగులే మీ ఆనందంగా భావిస్తారు. తల్లిదండ్రుల బాధ్యత సక్రమంగా నిర్వహిస్తారు. దైవానుగ్రహం అందుకుంటారు. ఓం నమో నారాయణ వత్తులు, అష్టమూలికా తైలంతో నిత్య దీపారాధన చేయండి. క్రీడా రంగంలో వున్నవారికి అనుకూలం. మీ గుర్తింపుకు కారణమయ్యే కొన్ని విజయాలు అందుకుంటారు.



## మకరం

రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అనుకూలం. గతంలో తీసుకున్న రుణాలు చెల్లించే విధంగా నిర్ణయాలు తీసుకుంటారు. స్వయంకృషితో కొన్ని కార్యక్రమాలు ప్రారంభిస్తారు. అష్టమూలికా తైలం, లక్ష్మీతామర వత్తులతో దీపారాధన చేయండి. ఆదాయం సమకూర్చుకుంటారు. నూతన విద్యల పట్ల ఆకర్షితులవుతారు. నూతన ఉద్యోగ ప్రయత్నాలు కలిసి వస్తాయి. వివాహ విషయ వ్యవహారాలు అనుకూలం.




## కుంభం

మీ వ్యక్తిత్వాన్ని, మీ పద్ధతిని కించపరిచేవారు, అసత్య ప్రచారాలు చేసేవారు తారసపడతారు. దూర ప్రాంత ప్రయాణాలు అనుకూలం. స్థిరాస్తి అమ్మకాల విషయాలు అనుకూలం. గోమతి చక్రాలతో లక్ష్మీదేవి అష్టోత్తరం చదువుతూ అమ్మవారికి పూజ చేయండి. పేరు ప్రతిష్టలు లభిస్తాయి. కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకుని, వెంటనే అమలు పరుస్తారు. మీ శక్తిమేరకు ఇతరులకు సహాయం చేస్తారు.




## మీనం

శత్రువర్గం పన్నే పన్నాగాలు మీరు ముందుగానే గ్రహిస్తారు. స్నేహితుల ద్వారా రుణంగా తీసుకున్న ధనాన్ని తిరిగి చెల్లిస్తారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయి. సుబ్రహ్మణ్య పాశుపత కంకణాన్ని చేతికి ధరించండి. కుటుంబ పురోగతికి సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారు. పోటీ పరీక్షల్లో పాల్గొంటారు. నూతన విద్యల పట్ల ఆసక్తి కనబరుస్తారు.


...గూగుల్ చెబుతూనే ఉంది.. మీరెళ్ళేసరికి
మీ బాసు తాళం వేసుకుని వెళ్తాడు అని!!


ఈరోజుతో నా రిటైర్మెంట్... రేపటి నుంచి
'పెన్షన్' వరకే దొంగతనాలు చేసేది..!!


సినిమా టికెట్లు కొనడానికి
లోను ఇవ్వబడును!!
రండి సార్..
ఆధార్ ఉంటే చాలు!!
BANK
బ్యాంకు
- లోన్స్
6/12/120
EMI లు
మొదటి రోజు
టికెట్టు 1200/-
పండు2
టాకీసు

ఈ వారం 'కార్టూన్స్'



చైనాలోని
హుకౌ జలపాతానికి
సంబంధించిన చిత్రాలివి. జలధారలు
పసుపు రంగులో వుండటం విశేషం.
శీతాకాలంలో జలపాతం గడ్డ కట్టి హిమ
సీమలా మారుతుందట.











